
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టుకు భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



నందన్ ఎలక్ట్రానిక్స్
సెల్ నెం. 9949010118
డీలర్స్ ఇన్ : సెక్యూరిటీ సిస్టం, సీసీ కెమెరాస్, బయోమెట్రిక్ అండ్ ఫైర్ సేఫ్టీ


Opp. Water Tank, Durga Nagar Junction, Mailrdevpally, Hyderabad-05



| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 195 | ది. 9-10-2025 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 195 | Date : 9-10-2025 | Thursday | Pages : 8 | Rs.1/- |


## స్వదేశీని స్వీకరించి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయండి..

### -దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు



**ముంబై, అక్టోబరు 8 (వార్తాప్రభ) :** ప్రజలంతా 'స్వదేశీ'ని స్వీకరించి, దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. బుధవారం నవీ ముంబైలో అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. స్వదేశీ వస్తువుల వాడకంవల్ల దేశంలో అభివృద్ధి వేగవంతం కావడమే కాకుండా యువతకు మరిన్ని ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు.దేశంలోని ప్రతి ఒక్కరూ గర్వంగా 'స్వదేశీ' అని చెప్పాలని, ఇది ప్రతి పౌరుడికి, మార్కెట్‌కు ఒక మంత్రంలా మారాలని, ప్రజలు దేశీయ వస్తువులను కొనుగోలు చేసి, వాటినే బహుమతులుగా ఇస్తే ఆ డబ్బు తిరిగి మన ఆర్థిక వ్యవస్థకే చేరుతుందని ప్రధాని చెప్పారు. తద్వారా వృద్ధి, ఉపాధి పెరుగుతాయని చెప్పారు. జీఎస్టీ సంస్కరణలవల్ల దేశానికి, ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, ఇటీవల ముగిసిన నవరాత్రుల్లో అమ్మకాలు భారీగా జరగడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గత యూపీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 2008 ముంబై ఉగ్రదాడుల తర్వాత పాకిస్థాన్‌పై ఎందుకు దాడి చేయలేదని, ఎవరి ఒత్తిడితో ఆనాటి ప్రభుత్వం ఆ నిర్ణయం తీసుకుందో దేశం తెలుసుకోవాలనుకుంటోందని అన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ బలహీన విధానాల వల్లే ఉగ్రవాదులు రెచ్చిపోయారని, దేశ భద్రత బలహీనపడిందని ఆరోపించారు. తమ ప్రభుత్వానికి మాత్రం దేశభద్రతే అత్యంత ప్రధానమని, ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి సమాధానం ఇచ్చామని గుర్తుచేశారు.



భీమవరం, పెదఅమిరం శ్రీ రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మాజీ శాసనసభ్యులు ముదునూరి ప్రసాద్ రాజు కుమారుడి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులు దివ్య, కృష్ణంరాజులకు వివాహ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్
-భీమవరం,అక్టోబరు 8 (వార్తాప్రభ) :

# దేశ చరిత్రలో ఏపీకి అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి

- రూ.87,520 కోట్లతో విశాఖలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ఏర్పాటు
- రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు 11వ ఎస్ఐపీబీ ఆమోదం
- 26 ప్రాజెక్టుల ద్వారా 67,218 మందికి ఉద్యోగ అవకాశాలు
- మెగా ప్రాజెక్టులకు ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు
- ఇప్పటి వరకూ 11 ఎస్ఐపీబీల ద్వారా రూ.7.07 లక్షల కోట్లు పెట్టుబడులు- 6.20 లక్షల ఉద్యోగ అవకాశాలు



**అమరావతి,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. దేశ చరిత్రలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆకర్షించింది. అమెరికా వెలుపల అతిపెద్ద డేటా సెంటర్‌ను గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా లిమిటెడ్ విశాఖలో ఏర్పాటు చేయనుంది. రూ.87,520 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ డేటా సెంటర్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన 11వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదాన్ని తెలియచేసింది. విశాఖలోని తర్లువాడ, అడవివరం, అచ్యుతాపురం సమీపంలోని రాంబిల్లి వద్ద మూడు క్యాంపస్‌లలో రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయనుంది. విశాఖకు రానున్న కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు అనుసంధానంగా ఈ క్యాంపస్‌లు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల ద్వారా రూ.1,14,824 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. తద్వారా 67,218 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. దాదాపు 3 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఎస్ఐపీబీ సమావేశం..ఇంధన రంగంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఏరో స్పేస్, ఆటోమొబైల్ మాన్యుఫాక్చరింగ్ రంగాలతో పాటు పర్యాటకానికి ఊతం ఇచ్చేలా ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులకు ఆమోదాన్ని తెలియచేసింది. రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్ ద్వారా దేశంలోనే అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఏపీకి సాధించటంపై ఐటీ శాఖామంత్రి నారా లోకేష్‌కు ముఖ్యమంత్రి, మంత్రులు అభినందనలు తెలియచేశారు. క్వాంటం వ్యాలీ తరహాలోనే డేటా సెంటర్లు ఏపీకి టెక్నాలజీ గేమ్ చేంజర్‌గా మారతాయని అన్నారు. కేవలం 15 నెలల కాలంలో పెట్టుబడుల ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. డేటా సెంటర్లతో ఓ ఎకో సిస్టం వస్తోందని.. విశాఖ నగరం తదుపరి స్థాయి ఏఐ సిటీగా మారుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యుత్ తక్కువ ధరకు అందిస్తే ఐటీ రంగానికి మేలు జరుగుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకూ జరిగిన 11 ఎస్ఐపీబీల ద్వారా రూ.7.07 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 6.20 లక్షల మందికి నేరుగా ఉద్యోగాలు దక్కనున్నాయి.

**ప్రాంతాల వారీగా పారిశ్రామిక ప్రాజెక్టుల అభివృద్ధి..** క్వాంటం వ్యాలీ తరహాలోనే రాష్ట్రానికి వస్తున్న ఈ డేటా సెంటర్లు టెక్నాలజీ రంగంలో కీలక మలుపు అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. విశాఖ పారిశ్రామిక అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఎకనమిక్ కారిడార్ తరహాలోనే రాయలసీమకూ ఓ ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించారు. ఆమేరకు మూడు ప్రాంతాలను పారిశ్రామిక జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తూర్పుగోదావరి నుంచి శ్రీకాకుళం వరకూ విశాఖ ఎకనామిక్ రీజియన్‌ను ఏర్పాటు చేస్తున్నామని అదే తరహాలో అమరావతి కేంద్రంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి నుంచి ప్రకాశం వరకూ ఒక ఆర్థిక ప్రగతి రీజియన్‌ను , నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో మరో ఎకనామిక్ డెవలప్మెంట్ రీజియన్లను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ , డ్రోన్ సిటీలతో పాటు ఆటోమొబైల్ కారిడార్లు అభివృద్ధి అవుతున్నాయని సీఎం అన్నారు. వీటితో పాటు ఉద్యాన పంటలకు కేంద్రంగా ఉన్న రాయలసీమ ఆగ్రో ప్రాసెసింగ్ హబ్‌గా మారుతోందని త్వరలోనే ప్రపంచ ప్రసిద్ధి చెందిన కేంద్రంగా ఈ ప్రాంతం మారుతుందని అన్నారు. అమరావతి రాజధాని నగరం క్వాంటం వ్యాలీతో నాలెడ్జి ఎకానమీ కేంద్రంగా మారుతుందని సీఎం అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లును కూడా అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతంగా తయారు చేయాలని.. దీని కోసం ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసుకుని ప్రాజెక్టులను ఆహ్వానించాలని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు వచ్చినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నా ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక ప్రాజెక్టులను రైల్వే లైన్‌కు కూడా అనుసంధానిస్తే లాజిస్టిక్స్ వ్యయం తగ్గి ఆయా ప్రాజెక్టులకు ప్రయోజనం కలుగుతుందని సీఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో విలువ జోడింపుపైనా దృష్టి పెట్టాలని అన్నారు. అలాగే ఆతిథ్య రంగానికి చెందిన ప్రాజెక్టులపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పర్యాటకులకు నాణ్యమైన వసతి లభించేలా చూడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న వివిధ కేటగిరీల హోటళ్లకు అనుబంధంగా ఎకో సిస్టం కూడా వచ్చేలా చూడాలని సూచించారు. తిరుపతిలో ఉన్న కలినరీ ఇనిస్టిట్యూట్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా హోదా పెంచి వివిధ సంస్థలను అనుసంధానించాలని పేర్కొన్నారు. కూచిపూడి, థింసా లాంటి సంప్రదాయాలతో పాటు వివిధ ఎక్స్ పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేసే అంశంపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇటీవల విజయం సాధించిన విజయవాడ ఉత్సవ్ తరహాలోనే విశాఖ, రాజమహేంద్రవరం లాంటి చోట్ల కూడా ఉత్సవ్‌లను నిర్వహించాలని సూచించారు.

**మెగా పారిశ్రామిక ప్రాజెక్టుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు..** అమెరికాలో వర్జీనియా నగరం డేటా వ్యాలీగా ఉందని.. ప్రస్తుతం విశాఖ కూడా రైడెన్, గూగుల్ ప్రాజెక్టులతో డేటా వ్యాలీగా రూపొందుతుందని ఐటీ మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రికి వివరించారు. టీసీఎస్ సంస్థ కూడా ఇక్కడ త్వరలోనే క్యాంపస్‌ను ప్రారంభించనుందని.. ఒక్క విశాఖ నగరంలోనే 5 లక్షల మందికి ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం.. ఐటీ సంస్థల్లు, అందులో పనిచేసే ఉద్యోగులకు హౌసింగ్‌తో పాటు రహదారులు, ఇతర మౌలిక వసతులు ఉండేలా ప్రణాళికలు చేయాలని సూచించారు. మాస్టర్ ప్లాన్‌తో స్థానిక టౌన్ షిప్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. అనకాపల్లి నుంచి విజయనగరం వరకూ ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉందని ముఖ్యమంత్రి వివరించారు. వీటితో పాటు 5 లక్షల మంది వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా ఉద్యోగాలు చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రామాయపట్నం సమీపంలో వస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీతో పాటు ఆర్సెలార్ మిట్టల్, రైడెన్ డేటా సెంటర్ లాంటి భారీ ప్రాజెక్టులు ప్రారంభం అయ్యే వరకూ పర్యవేక్షణ చేసేలా ప్రత్యేక అధికారులను నియమించాలని అన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులకు లాజిస్టిక్స్‌ను ఇంటిగ్రేట్ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక ప్రాంతాలు, నీటి సరఫరా, వినియోగం లాంటి అంశాలపై మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. 2028 నాటికల్లా జిందాల్ స్టీల్ ప్లాంట్ పూర్తి చేసేలా చూడాలని సీఎం పరిశ్రమల శాఖను ఆదేశించారు.

# బీసీ రిజర్వేషన్ల అంశంపై స్టే విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోని హైకోర్టు : విచారణ రేపటికి వాయిదా

- బీసీ రిజర్వేషన్ల అంశంపై ఉదయం నుంచి సాయంత్రం వరకూ సాగిన విచారణ
- తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసిన హైకోర్టు
- స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీపై ఏమీ చెప్పని హైకోర్టు

**హైదరాబాద్,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** బీసీ రిజర్వేషన్ల అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. జీవో నెంబర్ 9ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది. రేపు మధ్యాహ్నం 2.15 గంటలకు విచారణ జరపనుంది. తొలిరోజు సుదీర్ఘంగా జరిగిన వాదనల్లో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేస్తోందని పిటిషనర్లు వాదించారు. రాజకీయాలకు అతీతంగా బీసీ రిజర్వేషన్లకు మద్దతు లభించిందని గుర్తుచేసిన ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ శాసన వ్యవస్థ చేసిన చట్టాన్ని ఎవరూ ప్రశ్నించలేరని వాదించారు. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైందన్న సింఘ్వీ ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోవద్దని తీర్పులున్నాయని వాదించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు జీవోను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసి జీవో నంబర్ 9ను సవాల్ చేస్తూ మాధవరెడ్డి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేయగా బీసీల రిజర్వేషన్లకు అనుకూలంగా, వ్యతిరేకంగా పలు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. బీసీ సంఘం నేతలు ఆర్.కృష్ణయ్య, వీహెచ్‌తో పాటు పలువురు బీసీ నేతలు ఈ ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాదులతో పాటు ప్రభుత్వం తరపు న్యాయవాదులూ బలమైన వాదనలు వినిపించారు.




**పిటిషనర్ల వాదనలు :** తొలుత వాదనలు వినిపించిన పిటిషనర్ల తరపు న్యాయవాదులు నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేస్తోందని వాదించారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించొద్దని రాజ్యాంగం చెబుతుందన్న పిటిషన్ల తరపు న్యాయవాదులు తెలంగాణ ప్రభుత్వం బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లతో మొత్తం కోటా 67 శాతానికి చేరిందని వాదించారు. బీసీల కులగణనకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ నివేదిక సైతం పారదర్శకంగా లేదని పేర్కొన్నారు. మహారాష్ట్రలో రిజర్వేషన్లు 50శాతం దాటితే సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. రిజర్వేషన్లు పెంచుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నా 50 శాతం మించరాదని గుర్తు చేశారు. విద్యా, ఉద్యోగాల్లో 50 శాతం దాటినా పొలిటికల్ రిజర్వేషన్ పెంచరాదని పిటిషనర్ల న్యాయవాది వాదించారు.

**అప్పట్లో రిజర్వేషన్ల పెంపును కొట్టేశారు :** బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు అంటున్న ప్రభుత్వం బీసీ డెడికేషన్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేయలేదని పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్లపై శాస్త్రీయ ఆధారాలు చూపలేదన్నారు. 2011 జనాభా ఆధారంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు వర్తింపజేసిన సర్కారు ఎస్సీ, ఎస్టీల జనాభా పెరిగిందా? తగ్గిందా? అనే లెక్కల్ని పరిగణలోకి తీసుకోకుండా బీసీ రిజర్వేషన్లను ఎలా ఖరారు చేస్తారంటూ వాదించారు. 2018లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను ఇదే కోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికల నిర్వహణకు తాము వ్యతిరేకం కాదన్న పిటిషనర్ల న్యాయవాది రాజ్యాంగ విరుద్ధంగా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. జీవో నెంబర్ 9 ద్వారా పంచాయతీరాజ్ చట్టసవరణ జరిగినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం పేర్కొనటం లోపభూయిష్టమన్న పిటిషనర్ల న్యాయవాది జీవో 9లో పంచాయతీరాజ్ చట్టం ప్రస్తావనేలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రజలను తప్పుదోవపట్టిస్తోందన్న ఆయన, ప్రభుత్వం చెప్పిన విధంగా నడుచుకోవటం సరికాదన్నారు. ప్రభుత్వమే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే రాష్ట్ర ఎన్నికల సంఘం అభ్యంతరం చెప్పొచ్చు కానీ ఏకంగా జీవో ఆధారంగా షెడ్యూల్ సైతం విడుదల చేశారని వాదించారు.

**జీవో నెంబర్ 9పై స్టే ఇవ్వాలని కోరడం సరికాదు :** రాష్ట్ర ప్రభుత్వ తరుఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ రాజకీయాలకు అతీతంగా బీసీ రిజర్వేషన్లకు మద్దతు లభించిందని గుర్తు చేశారు. శాసన వ్యవస్థ చేసిన చట్టాన్ని ఎవరూ ప్రశ్నించలేరని ఏ సవరణ చేసినా, చట్టం చేసినా శాసన వ్యవస్థదే నిర్ణయమని వాదించారు. ప్రజల సంక్షేమ కోసం నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందన్న సింఘ్వీ, బీసీ డెడికేషన్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లను 50 శాతం కంటే ఎక్కువ పెంచొచ్చని కోర్టు దృష్టికి తెచ్చారు. జీవో నెంబర్ 9పై స్టే ఇవ్వాలని కోరడం సరికాదన్న సింఘ్వీ సమగ్ర గణన ద్వారా కులాల లెక్కలు లభించాకే ప్రభుత్వం రిజర్వేషన్లపై ముందుకొచ్చిందని వాదించారు. సామాజిక ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కులగణన సర్వే ఆధారంగా బీసీ డెడికేషన్ కమిషన్ అందించిన నివేదిక ఆధారంగానే బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందని కోర్టు దృష్టికి తెచ్చారు.


మహారాజశ్రీ కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E. P. No. 58/2025
in
O. S. No. 396/2006

Between:
అంకెం పోతురాజు వగైరా..
--------D. Hrs
మరియు
అంకెం సరస్వతి (Died)వగైరా..
--------J.Drs

TO :
**4th J.Dr :-** అంకెం అనిత, D/o. నారాయణ రావు , చేవెంద్ర, పెదన మండలం, కృష్ణాజిల్లా, (A. P.)
**8th J.Dr :-** అద్దంకి వెంకట నాగ మల్లేశ్వరి, W/o. వీర రాఘవులు, వలంద పాలెం, బందరు మండలం,కృష్ణా జిల్లా.(A.P.)
**9th J.Dr :-** మేడేపల్లి రమ, W/o.బాలాజి, డోర్ నెం. 6-10-31/1, బూస నిలయం, శోభనవినాయక నగర్, బాలా నగర్, హైదరాబాద్, తెలంగాణా రాష్ట్రం.

పై అడ్రస్సు లో గల J.Drs 4,8,9లకు పై నెంబరు E. P. లో C. P. C ఆర్డరు 21రూలు 35ప్రకారం నోటీసు నిమిత్తం ది 24.10.2025 వ తేదీ కి వాయిదా అయియున్నది. కావున పై అడ్రస్సు లో గల J.Drs 4,8,9లకు ఎటువంటి అభ్యంతరములు వున్న యెడల ది. 24.10.2025వ తేదీన ఉదయం గం. 10.30ని. లకుపై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా గానీ లేదా న్యాయవాది ద్వారాగానీ హాజరై తెలుపు కొనగలరు. లేని యెడల మీపరోక్షమున తదుపరి గ్రంధములు జరుపబడునని ఇందుమూలంగా తెలియ చేయడమైనది.

**(శ్రీకోర్టు వారి ఉత్తర్వులప్రకారం )**

**J.M. ప్రసాద్** (J. P.)
D. Hrs **తరపున న్యాయవాది**
**మచిలీపట్నం.**



**పాస్‌పోర్టు పోయినది**

కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, యనమలకుదురు, పోలీసు కాలనీ, వినాయకనగర్ 2వ లైన్, డోరు నెం.20-936 కాపురస్తుడు షేక్ హుస్సేన్ గారి కుమారుడు షేక్ మెహబూబ్ బాషా అను నాపేరిట హైదరాబాద్‌లో ది.22-05-2002న జారీచేసిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.ఇ2200408 మరియు కొన్ని కాగితములు కలిగిన కవర్‌ను ఇంటిలో ఉన్న నా బండిలో పెట్టియుండగా, ది.20-10-2022వ తేదీన ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినారు. వెంటనే పరిసర ప్రాంతంలో వెదకిననూ కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియ జేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికినచో నాకు తెలియవరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 8317633833


## జగన్ ఇంటికి డీఎస్సీ అభ్యర్థులు..! ప్లకార్డులతో నిరసనలు..!

**తాడేపల్లి,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** ఏపీలో కూటమి సర్కార్ తాజాగా మెగా డీఎస్సీ నిర్వహించింది. 16 వేలకు పైగా ఉద్యోగాలను ఇందులో భర్తీ చేసింది. గతంలో వైసీపీ సర్కార్ 6 వేల ఉద్యోగాలతో నోటిఫికేషన్ ఇస్తే దాన్ని రద్దు చేసి 16 వేల ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించింది. ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్ మెంట్ లెటర్లు కూడా ఇచ్చింది. దీంతో డీఎస్సీలో ఎంపికైన వారు ఉద్యోగాల్లో చేరిపోయారు. అయితే ఇప్పుడు ఎంపిక కాని అభ్యర్థులు వైసీపీ అధినేత వైఎస్ జగన్ తలుపు తట్టారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైసీపీ అధినేత వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం కమ్ ఇంటి వద్ద ఇవాళ భారీగా డీఎస్సీ అభ్యర్థులు తరలివచ్చారు. తాజా డీఎస్సీలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ ప్లకార్డులతో నిరసనలకు దిగారు. డీఎస్సీలో తాము ఎంపిక కాకపోవడానికి ఈ అక్రమాలే కారణమని ఆరోపించారు. జగన్‌ను కలిసేందుకు వారు తరలివచ్చారు. విషయం తెలుసుకున్న వైసీపీ వర్గాలు తాడేపల్లి నివాసంలోనే

8లో




**CHANGE OF SURNAME**

I, **PACHIGOLLA VENKATESWARAMMA (Old Name), W/o. Venkateswara Rao**, R/o. Door No.73-2-6, Flat No.302, Kamala Residency, Lakshmi Hospital Road, Patamata, Vijayawada-520010, NTR District, A.P. India. I have changed my surname as **PATCHIGOLLA VENKATESWARAMMA (New Name), W/o. Venkateswara Rao.** Hereafter my surname is known as **PATCHIGOLLA VENKATESWARAMMA (New Name), W/o. Venkateswara Rao.**



**CHANGE OF SURNAME**

I, **PACHIGOLLA VENKATESWARA RAO (Old Name), S/o. Subba Rao**, R/o. Door No.73-2-6, Flat No.302, Kamala Residency, Lakshmi Hospital Road, Patamata, Vijayawada-520010, NTR District, A.P. India. I have changed my surname as **PATCHIGOLLA VENKATESWARA RAO (New Name), S/o. Subba Rao.** Hereafter my surname is known as **PATCHIGOLLA VENKATESWARA RAO (New Name), S/o. Subba Rao.**

# సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ మరపురాని మరువలేని మధురమైన మహోన్నతవరం

## -కెవిఆర్ జూనియర్ కళాశాల కామర్స్ లెక్చరర్ ముస్తఫా




**విస్సన్నపేట,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** దేశంలో మన అందరి ఆకలి తీర్చే రైతన్న ఉపయోగించే వ్యవసాయ పనిముట్లు విత్తనాలు ఎరువులు పిచికారి మందులు చల్లే డ్రోన్ వరకు ఐదు శాతం నుంచి 15% వరకు జిఎస్టి మన కూటమి ప్రభుత్వం తగ్గించిందని కె.వి.ఆర్ ఒకేషనల్ అండ్ జూనియర్ కాలేజ్ కామర్స్ లెక్చరర్ ముస్తఫా కాలేజీ డిబేట్ కార్యక్రమంలో తెలియజేశారు. కూటమి ప్రభుత్వ పరిపాలనలో 375 కు పైగా వస్తువులలో ధరలలో తగ్గుదల రావడం పేదలకు మరపురాని మరువలేని మధురమైన మహోన్నత వరమన్నారు. వస్తు సేవల పన్ను తగ్గింపు వలన పది రూపాయల వస్తువు నుండి లక్షల రూపాయల వస్తువుల వరకు రాయితీలు అందుతున్నాయి అన్నారు. గతంలో ఐదు 12, 18,28 శాతంగా ఉన్న పొన్ను రేట్లు ఐదు శాతం నుండి 18 శాతానికి భారీగా తగ్గించడంతో 99 శాతం నిత్యవసర వస్తువులు ధరలు తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాచారచన పోటీలు కూడా నిర్వహించారు. పోటీలు పెట్టారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధినేత కే వెంకటేశ్వరరావు అలియాస్ కెవిఆర్ పాల్గొన్నారు.

# పి.ఎ.సి.ఎస్. లోన్ మెంబర్ దివంగత కొంద్రు శిలువమ్మ కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయం



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం, రంగన్నగూడెం శ్రీ నేతాజి వ్యవసాయ పరపతి సహకార సంఘం సభ్యురాలు, లోను మెంబరు కొడూరుపాడుకు చెందిన కొంద్రు శిలువమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించటం జరిగింది. ఈరోజు ఉదయం కోడూరుపాడు గ్రామంలో శిలువమ్మ స్వగృహానికి వెళ్ళి రంగన్నగూడెం పి.ఎ.సి.ఎస్. నుంచి 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, రంగన్నగూడెం పి.ఎ.సి.ఎస్. అధ్యక్షులు కనకవల్లి శేషగిరిరావు, రంగన్నగూడెం గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి, కోడూరుపాడు గ్రామ టి.డి.పి. అధ్యక్షులు కొండపల్లి వెంకటేశ్వరరావు చేతులమీదుగా ఆమె కుమారుడు కొంద్రు ప్రభాకరరావుకు అందజేయటం జరిగింది. ఈసందర్భంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల ద్వారా రైతులకు మార్కెట్ రేటుకు నాణ్యమైన ఎరువులు, వ్యవసాయదారుల పిల్లలకు విద్యారుణాలు, ధాన్యం సేకరణ కేంద్రాలు నిర్వహించటమే కాకుండా మరణించిన లోన్ మెంబర్లకు మట్టి ఖర్చుల క్రింద రు.10000 లు ఆర్థిక సహాయం చేయటం ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో పి.ఎ.సి.ఎస్. డైరెక్టర్లు గండి శ్రీనివాసరావు, సముద్రాల రామయ్య, కార్యదర్శి కసుకుర్తి వరలక్ష్మి రైతు ప్రముఖులు భీమినేని పాండురంగారావు, రెంటపల్లి పూర్ణచంద్రరావు, మండేపూడి రామకృష్ణ, అర్నేపల్లి వెంకటేశ్వరరావు, వేమూరి రాజా మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

# నగర ఉత్సవానికి బయలుదేరిన అమ్మవారు



**తిరువూరు,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** వాల్మీకి బోయ బజార్ నందు దసరా నవరాత్రుల సందర్భంగా బోయబజార్లో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో కొలువుతీరిన అమ్మవారు ప్రతిరోజు భక్తుల చేత ప్రత్యేక పూజలు అందుకున్న కనకదుర్గమ్మ తల్లిదసరా ఉత్సవాలలో భాగంగా మహిళలందరూ ప్రతిరోజు కలిసి బతుకమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో వివిధ రకాల పువ్వులతో అలంకరించి బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు దుర్గమ్మ తల్లి విద్యుత్ దీపాలంకరణలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారు కొలువు తీరారు యువతీ యువకుల డాన్సులు సంప్రదాయమైన కోలాటం తో అమ్మవారి ఊరేగింపు కొనసాగింది ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# "వార్తాప్రభ" వార్తకు స్పందన

## కమ్మిని గోడౌన్ కు తరలించిన హౌసింగ్ అధికారులు







**చంద్రగిరి,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** హౌసింగ్ అధికారుల నిర్లక్ష్యం – తుప్పు పడుతున్న కమ్మి అనే వార్త గత బుధవారం మన "వార్తా ప్రభ" దినపత్రిక నందు ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసినదే. దీనిపై స్పందించిన హౌసింగ్ ఏఈ దినేష్ రెడ్డి సంబంధిత అధికారులకు వెంటనే ఎండకి ఎండి, వానకి తడిచి తుప్పు పడుతున్న కమ్మినీ గోడౌనుకు తరలించాలని ఆదేశించారు. దీంతో హౌసింగ్ అధికారులు మార్కెట్ యార్డ్ ఆవరణంలో ఉన్న కమ్మిని గోడౌనుకు తరలించి భద్రపరిచినట్లు హౌసింగ్ ఏఈ దినేష్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ఆర్‌సీఎం రూపాంతరణ యాత్ర కి విశేష స్పందన






**నెల్లూరు,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** ఆర్సీఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరిగే రూపాంతరణ యాత్ర 2025 లో భాగంగా అక్టోబర్ 7న ఆంధ్రప్రదేశ్ నెల్లూరులో జరిగిన రూపాంతరణ యాత్ర విజయవంతంగా ముగిసినట్టు ఆర్ సీఎం మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ ఛబ్రా తెలిపారు. ఇక్కడ కమ్యూనిటీ సభ్యులు మరియు సహాయక కొనుగోలుదారులు ఉత్సాహభరితమైన వాతావరణం లో పాల్గొన్నారన్నారు. ఆర్సీఎం ప్రస్తుతం దేశవ్యాప్తంగా 20 లక్షలకు పైగా చురుకైన సహాయక కొనుగోలుదారులు ఉన్నారని, మరియు రాబోయే సంవత్సరాల్లో ఈ సంఖ్యను పెంచే ప్రణాళికలు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సంస్థ విస్తరించుకునే నెట్‌వర్క్ చక్కటి, తగిన ధరకు అందుబాటులో ఉండే ఉత్పత్తులపై పెరుగుతున్న డిమాండ్ మరియు స్వీయ ఆధారితత్వం కోసం స్థిరమైన అవకాశాలను సృష్టించే వేదికగా ఆర్ సీ ఎం పై ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా, ఆర్సీఎం నెల్లూరు మరియు ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న సమాజాల ప్రజలను శక్తివంతం చేయడంపై దృష్టి పెట్టిందని, మహిళలు, యువత, అన్ని వయసుల మరియు వర్గాల ఆశావహఈ వ్యాపారులకి సమాన అవకాశాలు సృష్టించడం ద్వారా ఆర్సీఎం జీవనాధారాలను బలపరచాలని, అభివృద్ధి ప్రయోజనాలు విస్తృతంగా పంచుకోవాలని లక్ష్యం పెట్టుకుందన్నారు. ఆర్సీఎం 25వ వార్షికోత్సవ వేడుకల భాగంగా జరిగిన యాత్ర 100 రోజులు కొనసాగుతున్న, 17,000 కిలోమీటర్ల దూరం, 75 నగరాలు మరియు 25 ప్రధాన కార్యక్రమాలను కవర్ చేస్తున్నదని చెప్పారు. నెల్లూరుకు జరిగిన యాత్రలో ఆర్సీఎం యొక్క ముఖ్య స్తంభాలు అయిన స్వస్థ్య (ఆరోగ్యం), సేవ (సేవాభావం), మరియు సంస్కారం (మూల్యాలు) పునఃస్వీకరించబడ్డాయని, ఆర్సీఎం వ్యవస్థ ద్వారా తమ జీవితాలను మార్పుచెందించిన మహిళ సాధకులు, యువ నాయకులు మరియు సమాజంలో మార్పు తీసుకువచ్చిన వ్యక్తుల ప్రేరణాత్మక ప్రయాణాలు ఈయాత్రలో వెలుగులోకి తీసుకుపోతున్నట్టు చెప్పారు. నగరంలో యాత్ర ముగిసినప్పుడు, ఆర్సీఎం ఇప్పటికే ఉన్న సహాయక కొనుగోలుదారులతో తమ బంధాన్ని మరింత బలపరచడంతో పాటు, పెరుగుతున్న నెట్‌వర్క్‌లో కొత్త సభ్యులను కూడా ఆహ్వానించిందని, నెల్లూరు ప్రజలు యాత్రను అపార ఉత్సాహంతో స్వాగతించారు, వందలాది మంది గ్రాండ్ వేడుకల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ఆర్సీఎం ప్రాంగీత్‌తో ప్రారంభమై, ఆర్సీఎం ప్రధాన సూత్రాలు మరియు లక్ష్యాలను తెలియజేసింది. తరువాత శారీరక ఫిట్‌నెస్ ప్రోత్సహించడానికి యోగా సెషన్ నిర్వహించబడిందన్నారు. ఇటీవల విడుదలైన "మనసు వాచ కర్మణ – ఒక కర్మయోగి జీవనీ", ఆర్సీఎం స్థాపకుడు తిలోక్‌చంద్ ఛబ్రా జీవితం ఆధారంగా రాసిన పుస్తకం, ఈ కార్యక్రమంలో కీలక పాత్ర పోషించిందన్నారు.

# తపాలా బిళ్ళల సేకరణ అలవాటుగా మార్చుకోవాలి - డిఎఫ్ఓ రామచంద్ర రావు





**కాకినాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** సాంకేతికత పెరుగుతున్న క్రమంలో ప్రతీ ఒక్కరూ తపాలా బిళ్ళల సేకరణను మంచి అలవాటుగా మార్చుకోవాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్ రామచంద్రరావు సూచించారు. తపాల శాఖ తరచుగా విడుదల చేసే స్టాంపులు వల్ల ఆ ప్రాచీనమైన కళ అజరామంగా భావితరాలకు అందాలని డిఎఫ్ఓ ఆకాంక్షించారు. బుధవారం స్థానిక సినిమా రోడ్డులోని సూర్యకళా మందిరంలో బుధవారం ఫిలోత్సవం–2025 "జిల్లా స్థాయి పిలాటలిక్ ఎగ్జిబిషన్ (తపాలా బిళ్ళల ప్రదర్శన)" కార్యక్రమం తపాలా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనకు అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిలాటలీ) జి శివ నాగరాజు మాట్లాడుతూ మొబైల్ ఫోనులు, అంతర్జాలం వేగముగా విస్తరించి, వ్యక్తిగత ఉత్తరాలు పూర్తిగా అంతరించిపోయే ఈ దశలో కూడా పిలాటలీ అభిరుచి గల అభిమానులు, ఔత్సాహికులు ఒకే వేదికపై తరచూ ఇలా ప్రదర్శనల ద్వారా ఈ కళకు జీవం పోస్తున్నారని కొనియాడారు. అలాగే పోస్టల్ స్టాంపులు విద్యార్థులలో ఎంతో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. ముఖ్య అతిథి జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు మాట్లాడుతూ ఈ ఫిలాటలీ అభిరుచి అతి ప్రాచీనమైనదని, తపాలా శాఖ తరచుగా విడుదల చేసే స్టాంపుల వలన ఈ కళ అజరామరంగా భావితరాలకు అందాలని ఆకాంక్షించారు. కాకినాడ డివిజనల్ సూపరింటెండెంట్ కె కృష్ణ తపాలా శాఖచే స్వయంగా నిర్వహింపబడుతున్న ఫిలాటలిక్ ఎగ్జిబిషన్ అని, కాకినాడలో గల అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ అరుదైన తపాలా బిళ్ళల ప్రదర్శనను తిలకించి ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ ఫిలాటలిక్ ఎగ్జిబిషన్ గురువారం కూడా కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ప్రదర్శనను అందరూ తిలకించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ పోస్టల్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ (హెడ్ క్వార్టర్స్) గంటి రామకృష్ణ, సామర్లకోట అసిస్టెంట్ పోస్టర్ సూపరిండెంట్ పివి రమణమూర్తి, సామర్లకోట అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ డి అనిల్ అంబేద్కర్ కుమార్, పోస్ట్ ఇన్స్పెక్టర్ ముదుగు లక్ష్మణ్ కుమార్, పెద్దాపురం పోస్టల్ ఇన్స్పెక్టర్ బి బ్రహ్మం నాయక్, పబ్లిక్ గ్రీవెన్సెస్ ఇన్స్పెక్టర్ బి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోస్టల్ స్టాంపుల ప్రదర్శనకు వివిధ పాఠశాలల విద్యార్థులు, ఔత్సాహికులు, పిలాటలిస్టు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రక్తహీనత మరియు ఇనుము జీవక్రియల అంశముపై కార్యశాల



**తిరుపతి,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** రక్తహీనత మరియు ఇనుము జీవక్రియ అనే అంశములపై ఎస్ వి వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియం నందు ఒక్క రోజు కార్యశాల అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు బుధవారము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనము రోజు తీసుకుంటున్న ఆహారంలో, ఐరన్ శాతాన్ని తగ్గించి తీసుకుంటున్న దాని వల్లన ఐరన్ లోపం , జీవక్రియలు మార్పులు చోటు చేసుకుంటున్న దానివలన రోజు వారి పనితీరులో, మానవ శరీరం పైన ప్రభావితం అవుతున్నదన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, ఐ సి ఎం ఆర్ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో భారత ప్రభుత్వం చే నిర్వహించబడుతున్న సంస్థ నుండి డాక్టర్ పి రఘు, సైంటిస్ట్ ఎఫ్, డ్రగ్ టాక్సికలజీ విభాగము వారు ఒక సందేశాన్ని ఎస్ వి వైద్య కళాశాల వైద్య విద్యార్థులకు యూజీ, మరియు పీజీ విద్యార్థులకు ఐరన్ లోపం, జీవక్రియ అంశముల మీద చర్చ సమావేశం నిర్వహించారు. అనీమియా అనే వ్యాధి అరికట్టాలంటే మీరు రోజువారి తీసుకుంటున్న ఆహారంతో పాటు, పండ్లు, ఖర్జూరము, ఎండు ద్రాక్ష, గోంగూర, మునగాకు, మరియు కరివేపాకును విరివిగా తీసుకొనవలెనని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఎస్.ఎన్ మూర్తి, ఎన్ఐఎన్ సంస్థ నుండి డాక్టర్ జె. జె. బాబు, మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ సి సునీత, ఎమ్మార్ హెచ్ ఆర్ యు సైంటిస్టు, మరియు వైద్య సిబ్బంది, యు జి, పి జి వైద్య విద్యార్థులు, మరియు ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

# జస్టిస్ గవాయిపై మతోన్మాది దాడిని ఖండించిన కడప యోగివేమన లా విద్యార్థులు




**కడప,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** సుప్రీంకోర్టుప్రధానన్యాయమూర్తి పై కోర్టు హాల్లోనే సనాతన ధర్మానికి అనుకూలంగా నినాదాలు ఇస్తూ న్యాయవాది బూటు విసిరి దాడికి తెగబడటం జరిగింది. ఇందుకు కడపలోని యోగి వేమన యూనివర్శిటీ గేటు ముందు లా విద్యార్థులు ఈ రోజు నిరసన తెలిపారు. నిరసనలో పాల్గొన్నా లా విద్యార్థి డి బి పి యస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ అత్యున్నత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి దళితుడు అయినందున కోర్టులోనే మతోన్మాద వ్యక్తి సీనియర్ లాయర్ తన బూటు విసరటం కులపిచ్చి ఉందో లేదో అర్థం అవుతుందని అన్నారు అతనిపై చట్టపరమైన కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని కేంద్ర ప్రభుత్వన్నీ డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక బార్ అశోషియన్లు కోర్టులు బహిష్కరిస్తూ నిరసనలుతెలియజేసారు. నేడు కొనసాగిస్తున్నారు. ఇది మంచి పరిణామం అని అన్నారు. ఇటీవల కాలంలో కొందరుముఖ్యమంత్రులు,మంత్రులు, నేతలు మతోన్మాదాన్ని, విద్వేషాన్ని రెచ్చగొడుతూ చేస్తున్న ప్రసంగాలకు ఇది పరాకాష్ట ఇటువంటి. సందర్భంలో లా విద్యార్థులు మైన మేము కూడా యోగి వేమన యూనివర్శిటీ వద్ద నిరసన తెలియజేశం అన్నారు అనంతరం మరొక లా విద్యార్థి అనిల్ మాట్లాడుతూ అతని పై చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. లా విద్యార్థి ప్రదీప్, మాట్లాడుతూ కుల వివక్షతోనే ఆంధ్రప్రదేశ్ కు చెందిన దళితుడు ఐ పి ఎస్ అధికారి ఆత్మ హత్య చేసుకున్నారని తెలిపారు.

# బాపులపాడు హైస్కూల్ లో మండలస్థాయి బాలికల స్కూల్ గేమ్స్



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** బాపులపాడు మండల స్థాయి స్కూల్ గేమ్స్ బాలికల ఆటల పోటీలు బుదవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన బాపులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు మరియు సెలెక్షన్స్ ను కబాడీ, వాలీ బాల్, ఖో ఖో, షటిల్ బాడ్మింటన్, చెస్, యోగ మరియు అథ్లెటిక్స్ నందు పోటీలు నిర్వహించి బాపులపాడు మండలం తరపున ఉత్తమ జట్లను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తెవి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం లో రిటైర్డ్ వ్యాయామోపాధ్యాయులు అక్కినేని రాఘవేంద్ర రావు , పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ యడవల్లి శ్రీనివాస్, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ బలే రామ చంద్రుడు,గుత్తా కృష్ణ కుమారి పామర్తి వేంకటేశ్వరరావు , ప్రభాకర రావు, నాగ సుబ్బారావు, డి.వెంకటేశ్వరరావు,రామారావు, మహబూబ , రాజేశ్వరి, భాగ్యరాజు,బల రామ్, శ్రీనివాస్, ప్రవీణ్, ఖన్నా, స్వామి, మరియు బాపులపాడు మండలం లోని వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఉన్నత పాఠశాలల నుండి 250మంది క్రీడాకారిణి లు పాల్గొన్నారు. ఈ నెల 7,8 తారీకులలో జరిగిన ఈ కార్యక్రమానికి వ్యాయామోపాధ్యాయులకు ఉపాధ్యాయులకు భోజనవసతి ఎం పి పి యరగొర్ల నగేష్ ,మరియు స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్య ప్రసాద్ ఏర్పాటు చేశారు.

# కప్పలదొడ్డిలో కైలాసపుర మందిరం



**పెడన,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో స్మశాన వాటిక సదుపాయాల నిమిత్తం గ్రామపంచాయతీ దాతల సహాయ సహకారాలతో నిర్మాణ బాధ్యతలు తీసుకొని గ్రామస్తులకు కైలాసపురం మందిరం అను నామకరణతో కప్పలదొడ్డి గ్రామస్తులందరికీ అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ మందిరం ముఖ్యముగా స్మశానాలకు వెళ్లి తిరిగి ప్రయాణం స్నానాలు ఆచరించుటకు మహిళలు పుణ్యవతి పూజలు చేయుటకు కనీస వసతులు లేని గృహాలు లేని అవసరమైన వారికి దశాహ కార్యక్రమాలు జరుపుకొనుటకు మరణాంతరం జరుగు హిందూ సంప్రదాయ పూజా కార్యక్రమాలు ఆ పది రోజులు జరుపుకొనుటకు అనుకూలంగా ఉండునని ఆలోచన ధోరణితో ఈ నిర్మాణం చేపట్టడం జరిగింది. ముఖ్యముగా దాతల సహకారంతో ఈ నిర్మాణ బాధ్యతలు తీసుకున్న పేరిశెట్టి నాగ రవి భూసం సాయిబాబు బల్ల నాగేశ్వరరావు మరక విఘ్నేశ్వరరావు మరియు తదితర సభ్యులు అతి తొందరగా పూర్తి చేయగలిగినందుకు గ్రామస్తులందరూ ధన్యవాదాలు తెలపటం జరిగింది. ముఖ్యముగా మరణించిన వారి ఇంటి దగ్గర నుండి స్మశాన వాటిక వరకు తరలించుటకు కైలాసపుర వాహనం కూడా ఏర్పాటు చేయటం జరిగింది.

# జి ఎస్ టి 2.0 పై వ్యాసరచన పోటీలు




**పెడన,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపర్ సిక్స్ సూపర్ సేవింగ్స్ జీఎస్టి 2.0 లో భాగంగా బుధవారం పెడన పురపాలక సంఘం పరిధిలో పురపాల సంఘం స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ వారు సంయుక్తంగా నిర్వహించిన జీఎస్టీ 2.0 మీద క్విజ్, డ్రాయింగ్ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనబరిచిన వారికి విశ్వభారతి హైస్కూల్ లో జీఎస్టి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ అత్తిలి రంగామణి పెడన మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్ రెడ్డి విశ్వ భారతి స్కూల్ ప్రిన్సిపల్ అనుమకొండ గౌరీ ప్రసాద్ ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు ప్రధానం చేశారు. ప్రతి విద్యార్థి జీఎస్టి 2.0 మీద అవగాహన కలిగి ఉండాలని అలాగే జీఎస్టీ 2.0 లో కేవలం 18 శాతం 5శాతం రెండు స్లాబ్లు మాత్రమే ఉన్నాయని జీఎస్టీ సంస్కరణలు తెలుసుకోవాలని జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్ విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి విద్యార్థి కూడా జీఎస్టీ 2.0 అవగాహన చేసుకోవాలని వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ విజేతలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీఎస్టి డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ అత్తిలి రంగామణి మున్సిపల్ కమిషనర్ ఎల్. చంద్రశేఖర్ రెడ్డి విశ్వ భారతి హై స్కూల్ అనుమకొండ గౌరీ ప్రసాద్ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# అతి తక్కువ ఖర్చుతో కంటి ఆపరేషన్ నిర్వహించబడును రవి కంటి హాస్పిటల్ డాక్టర్ రవికుమార్



**తిరువూరు,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** తిరువూరు పాత జయకృష్ణ హాస్పటల్ నందు ఉన్నరవి కంటి ఆస్పటల్ డాక్టర్ ప్రముఖ కంటి వైద్య నిపుణులు పెనుమల్లి రవి కుమార్ మాట్లాడుతూ హాస్పటల్ ప్రారంభించిన నాటి నుండి ఇప్పటివరకు చుట్టుపక్క ప్రాంతాలలో ఉన్న ప్రజలకు అధునాతనమైన పరికరాలతో అతి తక్కువ ఖర్చుతో కంటి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించాము గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉచితంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత సేవలు అందించాము అవసరమైన ప్రతి ఒక్కరికి ఉచితంగా కంటి పరీక్షలు చూసి మందులు అందించాము కంటి ఆపరేషన్ అవసరమైన వారికి అతి తక్కువ ఫీజు తీసుకొని ఆపరేషన్ నిర్వహించాము 24 గంటలు కంటి వైద్యం అందించటానికి అందుబాటులో ఉంటున్నామని డాక్టర్ రవికుమార్ తెలియజేశారు

# రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలకు ఆదిత్య, శ్రీనగర్ విద్యార్థులు




**కాకినాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్లో జరిగిన క్రీడల్లో కాకినాడ, శ్రీనగర్ ఆదిత్యపాఠశాలకు చెందిన 28 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం ఆనందాన్నిచ్చిందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ .టి.రమేష్ మాట్లాడుతూ ఆదిత్యస్కూల్, శ్రీనగర్ స్కూల్ విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని, ఇప్పటికే తమ పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీలలో జాతీయస్థాయిలో ప్రతిభ చూపారన్నారు. అదేవిధంగా జూడో, సాఫ్ట్ టెన్నిస్, లాన్ టెన్నిస్, స్క్వాష్, తైక్వాండో, రెస్లింగ్, సాఫ్ట్బాల్, స్కేటింగ్, హ్యాండ్బాల్, నెట్బాల్, హాకీ తదితర అన్ని విభాగాల్లో తమ విద్యార్థులు క్రీడా నైపుణ్యం ప్రదర్శించి చక్కని గుర్తింపు పొందారని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ విజయ ఉమాపతి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు విద్యతో పాటూ క్రీడల్లో కూడా రాణించడం అత్యంత గర్వకారణం అన్నారు. తదనంతరం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను,వారిని తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయుల బృందాన్ని ఆదిత్య విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ . టి.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ , విజయ ఉమాపతి, ఉపాధ్యాయులు అభినందించారు.

# ఎడిటోరియల్

## పోలవరంలో.... పైసల గోల.. !

పోలవరం ప్రాజెక్టు ద్వారా ఇటు ఉత్తరాంధ్రను, అటు రాయలసీమను కూడా సస్యశ్యామలం చేస్తామని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతున్నారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడిగా మారుతుందని కూడా ఆయన వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాదు 2027 నాటికి ఈ ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాలువను పూర్తి చేసి నీటిని అందిస్తామని కూడా ఇటీవల అసెంబ్లీలో ప్రకటించారు. ఆ తర్వాత మీడియాకు కూడా సమాచారం ఇచ్చారు. అనేక అంశాలను ప్రస్తావిస్తూ చేసిన పోలవరం ప్రకటన ఆసక్తిగానే ఉంది. %కూ్రీంశీ =ముు% - ఏంటీ..20 ఏళ్లకే కూల్చేద్దామని ఐఫిల్ టవర్ నిర్మించారా.. దీని వెనుక అసలు కథ ఏంటంటే? కానీ తాజాగా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన తాకీదు రాష్ట్ర ప్రభుత్వాన్ని కలవరపాటుకు గురిచేస్తోంది. దీనికి కారణం గత 2024-25 మధ్య కాలంలో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో 2000 కోట్ల రూపాయలను పోలవరానికి ఇచ్చారు. అప్పట్లో కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం వద్దకు వెళ్లి ప్రధానమంత్రిని, అదేవిధంగా ఆర్థిక శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ఈ సొమ్మును బడ్జెట్లో కేటాయించారు. దీనిలో నుంచి 1850 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించారు. అయితే ఈ సొమ్మును నిర్దేశిత ఖాతాలో ఉంచి ఖర్చు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈ నిధుల విషయంలో లెక్కలు ఇప్పటివరకు చెప్పలేదు అనేది కేంద్ర ప్రభుత్వం చెబుతున్న మాట. దీనికి సంబంధించి ఇటీవల రాష్ట్ర జల వనరుల శాఖకు పెద్ద లేఖ కూడా వచ్చింది, 1850 కోట్ల రూపాయల ఖర్చుకు సంబంధించి లెక్కలు ఏవి అని అడిగింది. అయితే, దీనిపై నేరుగా సమాధానం చెప్పని రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండిపోవడం విశేషం. అయితే దీనివల్ల నష్టం ఏంటి అనే సందేహం వస్తుంది ఈ ఏడాది అంటే 2025 -26 వార్షిక బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం 5000 కోట్ల రూపాయల పైచిలుకు మొత్తాన్ని పోలవరం ప్రాజెక్టుకు కేటాయించింది. ఈ నిధుల నుంచి పోలవరం పునరావాసం అదేవిధంగా భూములు ఇచ్చిన వారికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తంలో నాలుగు వేల కోట్ల రూపాయలు పైగా పునరావాసానికి, నష్టపరిహారానికి కేటాయించగా.. మిగిలిన సొమ్మును పోలవరం ప్రాజెక్టుకు తిరిగి ఖర్చు చేయాలి. అయితే గతంలో ఇచ్చిన పద్దెనిమిది వందల యాభై కోట్ల రూపాయలకు లెక్కలు చెప్పని కారణంగా ఈ 5000 కోట్ల పైచిలుకు మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం స్టాల్ చేసింది. అంటే నిలిపివేసింది. దీంతో ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి ఊపిరాడని పరిస్థితి ఏర్పడింది. ఆ 1850 కోట్ల రూపాయల లెక్క పక్కనపెట్టి ఇప్పుడు కేటాయించిన 5000 కోట్ల రూపాయలను ఇవ్వాలని ఇటీవల ఢిల్లీ పర్యటనలో చంద్రబాబు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి కి విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. అయితే ఈ విషయం తన పరిధిలో లేదని జల శక్తి శాఖ పరిధిలో ఉంది కాబట్టి అక్కడ చర్చించాలని ఆర్థికమంత్రి తప్పుకున్నారు. కానీ జల శక్తి మంత్రిత్వ శాఖ మాత్రం లెక్కలు చెప్పాల్సిందేనని ఇది మీ రాష్ట్రానికి ఒక రకంగా.. వేరే రాష్ట్రానికి మరోరకంగా చేసే పరిస్థితి లేదని తాజాగా పంపిన లేఖలో స్పష్టం చేశారు. థిస్ ఈజ్ మాండేటరీ అని పేర్కొనడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారనే చెప్పాలి. మరోవైపు పోలవరం నిధులపై గత వారం రోజులుగా చర్చ అయితే నడుస్తోంది. 1850 కోట్ల రూపాయలను ఏం చేశారన్నది ప్రభుత్వానికి తెలిసినప్పటికీ.. బయటికి చెప్పడానికి మాత్రం ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి.

## బెజవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో ప్రముఖ సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాజ్యసభ సభ్యులు, ప్రముఖ సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయన కోసం ఆలయ అధికారులువిశేష పూజలు చేయించారు. ఆలయానికి చేరుకున్న విజయేంద్ర ప్రసాద్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం అందించారు. సంప్రదాయం ప్రకారం, అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, మరియు శేషవస్త్రాన్ని విజయేంద్ర ప్రసాద్‌కు అందించారు.

## పంతులమ్మ హితవు



ఓర్వలేనితనాన్ని
న్యూనతా భావాన్ని
జయిస్తేనే వీరులు
అసూయద్వేషాల్ని
నిరాశానిస్పృహలనుజి
మదిని పిరికితనమును
ఏమాత్రం రానియ్యకు
లక్ష్యం చేరేవరకు
నీచమైన తలపులను
పనికిరాని బుద్ధులను
దూరంగా ఉంచాలి
చెరుపు చేయు వ్యక్రులను
ప్రేమించే మనషులను
ఆదుకున్న ఆప్తులను
వెన్నుపోటు పొడవొద్దు
దూరం చేసుకోవద్దు

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు, 9966414580

## మీరు చేపట్టిన కార్యక్రమంచాలా సంతోసించదగ్గవి ఉమ్మడి కార్యాచరణతో ముందుకెళ్దాం

### ఆంధ్రప్రదేశ్ తెలుగు , సంస్కృత అకాడమీ అధ్యక్షులు ఆర్.డి.విల్సన్





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మహా సంకల్పంతో జిల్లా యంత్రాంగం, పర్యాటకశాఖ మరియు ఇతర శాఖల సహకారంతో మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ నవంబరు 22, 23 తేదీలలో విజయవాడలో నిర్వహిస్తున్న 'జాతీయ సాంస్కృతిక ఉత్సవాల పిలుపుల్లో భాగంగా, ఉత్సవాల కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ మంగళగిరిలోని తెలుగు %ఱ% సంస్కృత అకాడమీ కార్యాలయంలో అకాడమీ అధ్యక్షులు ఆర్.డి.విల్సన్ ని కలిశారు. ఆయన ఎంతో ప్రేమగా కలిమిశ్రీ బృందాన్ని ఆహ్వానించి ఆత్మీయ కరచాలనం చేశారు. చిక్కటి తేనీరు తెప్పించి తన అనురాగాన్ని చాటుకున్నారు. సుప్రసిద్ధ కథ, నవలా రచయితగా, భాషా ప్రేమికుడిగా, భాషాసేవకుడిగా సమాజానికి శరత్ చంద్ర చేసిన సేవలను గుర్తించి ద్విభాషా అకాడమీకి అధ్యక్షులుగా నియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ శరత్ చంద్ర కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కలిమిశ్రీ మరియు కమిటీ బృందం. సాంస్కృతిక ఉత్సవాల ప్రాధమిక సమాచారంతో కూడిన కరపత్రాన్ని ఆయనకు అందజేసి నవంబరులో జరిగే జాతీయ సాంస్కృతిక ఉత్సవాలకు రమ్మని ఆహ్వానించారు. ఆ సంబరాల్లో నిర్వహించబోతున్న కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. "చాలా సంతోషమండీ... తెలుగు భాష పరిరక్షణ కోసం, భాష, కళలు, సాహిత్యం, సంస్కృతుల పునర్ వైభవంకోసం ఇలాంటి సాంస్కృతిక ఉత్సవాలు ఎన్నో జరగాల్సిన అవసరముంది. ఉమ్మడి కార్యాచరణతో మనందరం కలిసి రాష్ట్రంలో సాహిత్య, సాంస్కృతిక, కళా వైభవానికి కొత్త మెరుగులు దిద్దుదాం..." అంటూ ఉత్సవాలకు తన సంపూర్ణ మద్దతును ప్రకటిస్తూ... ఈ మహా యజ్ఞంలో పాత్రికేయ మిత్రులు కలిసి రావాలని, తమ పూర్తి సహకారం అందించాలని కోరారు- ఆంధ్రప్రదేశ్ తెలుగు %ఱ% సంస్కృత అకాడమీ అధ్యక్షులు ఆర్.డి.విల్సన్ ఏ శరత్ చంద్ర. ఒక గొప్ప కార్యక్రమ నిర్వహణకు సంకల్పించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కి, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మర్యాద పూర్వక కలయికలో కలిమిశ్రీతో పాటు ఉత్సవాల కమిటీ బాధ్యులు చొప్పా రాఘవేంద్రశేఖర్, వై.డి. ఆనంద్, విష్ణుభొట్ల రామకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నేరస్థులూ.... తస్మాత్ జాగ్రత్త

● ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనరేట్ పరిదిలో నేరం చేసి తప్పించుకోవాలనుకుంటే అది పొరపాటే ● సి.సి.కెమెరాల నిడివి ఆధారంగా అతి తక్కువ సమయంలో ఎటువంటి ఆదారాలు లేని హత్య కేసును చేధించిన ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసులు ● ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనరేట్ నందు భద్రత అంటే కేవలం భరోసా కాదు నిరంతర పర్యవేక్షణ కూడా........ ● అంధుకే మొదటి సారి నగరాల నుండి గ్రామాల వరకు 100 శాతం సి.సి.కెమెరాల కవరేజ్ ● కీలక కేసును చేదించిన అధికారులకు సిబ్బందికి అభినందనలు ● నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎస్.వి.రాజ శేఖర బాబు ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనరేట్ పోలీసు కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ప్రజల భద్రతను బలోపేతం చేయడం, ప్రజలలో పోలీసులపై విశ్వాసాన్ని పెంపొందించడం, మరియు ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించి శాంతి భద్రతలను పరిరక్షించడం మొదలైనవి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పోలీస్ యొక్క ప్రధాన లక్ష్యంగా, ప్రజల మేలును ఎల్లప్పుడూ ప్రాధాన్యంగా తీసుకొని, సురక్షితమైన మరియు శాంతిమయమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలనే సదుద్దేశంతో ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ పలు కీలకమైన సంస్కరణలు చేశారు. ఈ కృషిలో బాగంగా ఈ పహారా.... సురక్షా....సురక్షా డివైన్...తదితర మొత్తం 10 రకాలు కార్యక్రమాలతో ప్రజలకు విశేష సేవలనిస్తుంది ఎన్.టి.ఆర్.పోలీస్ కమీషనరేట్.

ఈ క్రమంలో నగరంలో ప్రజల భద్రత కోసం "సురక్షా" అనే పేరుతో, ఫర్ సేఫ్ నెయిబర్‌హుడ్ అనే కమ్యూనిటీ పోలీసింగ్ ఏర్పాటు చేసి ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనరేట్ పరిదిలో 321 గ్రామాలు, 20 మండలాలు, 4 మునిసిపాలిటీలు, ఒక నగరపాలక సంస్థ, 64 వార్డులు మొత్తం 1211 చదరపు కిలోమీటర్లు అంతా నిరంతర సి.సి.కెమెరాల పర్యవేక్షణ అయ్యేవిధంగా సుమారు 10 వేల సి.సి.కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మధ్య కాలంలో జరిగిన పలు నేరాలను అతి తక్కువ సమయంలో సి.సి.కెమెరాల నిడివి ద్వారా వారిని గుర్తించి ఆధునిక టెక్నాలజీ ఆదరంగా చేసుకుని వారి కధలికలపై నిఘా ఏర్పాటు చేసి అదుపులోనికి తీసుకుని అరెస్టు చేయడం జరుగుతుంది. ఈ క్రమంలో ఈ నెల 1న సాయంత్రం 4:00 గంటల సమయంలోగొల్లపూడిలోని బొమ్మసాని సుబ్బారావు నగర్ వద్ద మురుగునీటిలో రెండు చేతులు, రెండు కాళ్లు, తల లేని కేవలం ఒక మొండెం భాగం మాత్రమే ఉన్న మహిళ మృతదేహం ఉన్నదని సమాచారంపై భవానిపురం పోలీసు వారు అనుమానాస్పద మృతి క్రింద కేసు నమోదు చేసి ధర్యాప్తు ప్రారంభించారు.ఒళ్ళు గగుర్పాటు కలిగించే ఆ ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసు కమిషనర్ పశ్చిమ జోన్ ఏ.డి.సి.పి. గుణ్ణం రామకృష్ణ , ఏ.సి.పి. శ్రీ దుర్గారావు పర్యవేక్షణలో, ఇన్స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి, చుట్టుపక్కల విచారించారు. ఈ క్రమంలో పొత్తూరి విజయలక్ష్మి (70), చిట్టినగర్‌లోని సాయిరాం థియేటర్ సమీపంలోని వాసవి కళ్యాణ మండపం నకు వెళ్ళి ఇంటికి తిరిగి రాలేదని వచ్చిన సమాచారం మేరకు అక్కడ పోలీసు వారు ఏర్పాటు చేసిన సి.సి.కెమెరాలను పరిశీలించి ఆ మహిళను ఒక వ్యక్తి బైక్ పై తీసుకు వెళ్ళినట్లు గుర్తించారు, ఆ వ్యక్తి ఇంటి సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా, మృతురాలిని గతనెల 30 తేదీ సాయంత్రం 4.00 గంటల సమయంలో ఇంటి లోపలికి తీసుకువెళ్లినట్లు, అప్పటి నుండి మృతురాలు తిరిగి రానట్లు, తరువాత ముద్దాయిలు వంకధార హనుమాన్ జి సుబ్రహ్మణ్యం మరియు అతని కుమారుడు వంకధార లక్ష్మీ నరసింహస్వామి పలుమార్లు ఇంటి నుండి బ్యాగులతో బయటకు వచ్చి బండిపై వెళ్ళినట్టు గుర్తించారు. వారిని బుధవారం అదుపులోనికి తీసుకుని విచారించి వారిని అరెస్టు చేయడం జరిగింది. అతి తక్కువ సమయంలో నేరస్థుడు తప్పించుకోకుండా పక్కా ఆధారాలతో ఈ హత్య కేసును చేధించడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులను మరియు సిబ్బందిని నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు అభినంధించారు.ఈ సంధర్భంగా నగర పోలీసు కమిషనర్ మాట్లాడుతూ... నగరంలో నేరం చేసి తప్పించుకోలేరు. ఎవ్వరూ చూడటం లేదుకదా నేరం చేసేశాము తప్పించుకున్నాము అంటే పొరపాటే, నగరంలో ప్రతి వీధిలో సి.సి.కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగింది. సి.సి.కెమెరాలు చూస్తూనే ఉంటాయి, నేరస్తులు ఎవ్వరినీ వదిలేది లేదని, అదునాతన టెక్నాలజీని ఉపయోగించి స్మార్ట్ గా వ్యవహరిస్తూ పక్కా ఆధారాలతో నేరాలను చేధించి నిందితులను అరెస్టు చేసి శిక్ష పడే విధంగా చేయడం జరుగుతుంది. ప్రజల పట్ల పూర్తి బాధ్యత తో పోలీసు శాఖ పని చేస్తుందని బుధవారం విడుదల చేసిన ఓ పత్రికా ప్రకటన ద్వారా ప్రజలకు సి పి తెలియజేశారు.

## మహిళలు స్వయం ఉపాధి పొందాలి

### ఎన్టీఆర్ జిల్లా ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ ఎఆనంద్ ,పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ లోని స్వయం సహాయ సంఘ సభ్యుల అభ్యున్నతికి ఎమ్మెల్యే సుజనా చౌదరి కృషి చేస్తున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను గురించి తెలియజేస్తూ వారిని మరింత ప్రోత్సహించేలా అవగాహన కల్పిస్తున్నారు.కేదారేశ్వరపేట ఫ్రూట్ మార్కెట్ ప్రాంతంలోని విఎంసీ కళ్యాణ మండపం లో వర్క్ షాప్ నిర్వహిస్తున్నారు. స్వయం సహాయ సంఘాల సభ్యులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి వారి ఆర్థిక స్వావలంబన కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను గురించి తెలియజేస్తున్నారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ , ఎన్టీఆర్ జిల్లా ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ ఎ ఆనంద్, స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ జీ పవన్ కుమార్, పిళ్ళైయార్ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ సత్య ప్రశాంత్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి ,35 వ డివిజన్ టీడీపీ అధ్యక్షురాలు బుధాల నంద కుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని పలు అంశాలపై వివరణ ఇచ్చారు.. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు వారి ఆర్థిక స్వావలంబన ప్రభుత్వాలు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు మహిళలు వ్యాపారాలు ప్రారంభించడానికి నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. సూక్ష్మ చిన్న పరిశ్రమలను స్థాపించే వారికి పిఎంఈజీపి పథకం ఉపయో గపడుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పెట్టిన ఈ పథకంలో స్వయం ఉపాధి అవకాశాలు పొందేవారు 18 ఏళ్లు పైబడిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు..ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ప్రత్తిపాటి శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అందిస్తున్న పథకాల గురించి తెలియజేశారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాల మేరకు మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సీ ఓ కిరణ్మయి , ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది రియాజ్ సుల్తానా, మోహనలక్ష్మి, ఆర్పీలు, సమైక్య డ్వాక్రా సంఘాల మహిళలు, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు..

## అట్టహాసంగా నగరాల కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ళ తిరుమలేశ్వర రావు, మరియు డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం..

### శుభాకాంక్షలు తెలిపిన ఎన్డీఏ కూటమి నేతలు





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నగరాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ళ తిరుమలేశ్వర రావు, మరియు నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ , ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు,మాజీమంత్రి , కేడీసీసీ చైర్మన్ నెట్టం రఘురాం, నగరాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాయన ఆది బాబు,గంటా రవితేజ, ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్ నగరాల కుల బంధువులు, కూటమి నేతలు పాల్గొని చైర్మన్ మరుపిళ్ళ తిరుమలేశ్వర రావు కు కార్పొరేషన్ డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని ఈ సందర్భంగా మరు పిళ్ళ తిరుమలేశ్వర్రావు హామీ ఇచ్చారు.

## అవ్వారు శ్రీనివాసరావు ను అభినందించిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దుర్గగుడి పాలకమండలి సభ్యులు గా ఇటీవల నియమితులైన ఎన్టీఆర్ జిల్లా బీజేపీ కోశాధికారి అవ్వారు శ్రీనివాసరావు (బుల్లబ్బాయి) ని ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అభినందించారు.. దుర్గగుడి పాలకమండలి సభ్యులు గా నియమితులైన అవ్వారు శ్రీనివాసరావు ఎన్డీఏ కార్యాలయానికి విచ్చేశారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అవ్వారు శ్రీనివాసరావు (బుల్లబ్బాయి) ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు .

## అనారోగ్యంతో బాధపడుతున్న వివాహిత అదృశ్యం

### కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టిన కొత్తపేట పోలీసులు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని కే ఎల్ రావు నగర్ కి చెందిన ఓ వివాహిత అదృశ్యం కాగా కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం జి వేలంగిణి( 52) నగరంలో ఎన్ సి సి కార్యాలయంలో టైపిస్టు గా విధులు విర్వహిస్తుంది. కొంతకాలంగా బ్రైన్ లో రక్తం గడ్డకట్టి ఇబ్బంది పడుతుంది. కొంత కాలం మందులు వాడినా ఈ మద్యే ఆపేసింది. కాగా ఈ నెల 7 తేదీన ఇంటినుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువులు వద్ద వాకబు చేసినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు.దాంతో ఆమె కుమార్తె బుధవారం పోలీసులకు పిర్యాదు చేస్తూ తన తల్లిదండ్రులు అన్యోన్యంగానే ఉంటారని ఆమె ఎందుకు ఇంటినుంచి వెళ్ళిందో తెలియదని తన ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

## ముగిసిన కలెక్టర్ నరేగా రివ్యూ సమావేశం



**విస్సన్నపేట అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం నరేగా కలెక్టర్ రివ్యూ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్న రాట్నాలు నరేగా సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో పారదర్శకతకు ముఖ ఆధారిత హాజరు

**- త్వరితగతిన శ్రామికుల ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తిచేయండి**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఉపాధి హామీ పథకంలో పారదర్శకతను మరింత పెంచేందుకు, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చేసేందుకు వేతనదారుల ముఖ ఆధారిత హాజరు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆధార్ డేటా, ఈ-కేవైసీతో ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ లక్ష్మీశ ఎంపీడీవోలు, డ్వామా అధికారులు, సిబ్బందితో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులను సమీక్షించడంతో పాటు పథకం అమల్లో పురోగతిపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఉపాధి శ్రామికుల ముఖ గుర్తింపు హాజరు నమోదుకు సంబంధించిన ఫేస్ - ఆర్డీ అండ్ ఎన్ఎంఎంఎస్ యాప్‌ను ఫీల్డ్ అసిస్టెంట్లు డౌన్‌లోడ్ చేసుకునేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తించేందుకు అవసరమైన ప్రణాళికపై దృష్టిసారించాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు చూస్తే సగటు వేతనం విషయంలో గంపలగూడెం, కంచికచెర్ల, జగ్గయ్యపేట మండలాలు మొదటి మూడుస్థానాల్లో నిలిచాయని.. ప్రతి మండలం ఈ విషయంలో ప్రగతి చూపేందుకు కృషిచేయాలన్నారు. జిల్లాలో 2025-26లో 4 వేల ఎకరాల ఉద్యానపంటల సాగును లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటివరకు 3,745 ఎకరాలను గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా మునగ సాగుకు 880 ఎకరాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఉద్యాన పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది వివరించాలన్నారు. స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి కీలక ప్రగతి సూచికల్లో (కేపీఐ) పురోగతిపైనా అధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టే సీసీ రోడ్లు, పశువుల షెడ్లు, మ్యాజిక్ డ్రెయిన్లపైనా చర్చించి, కలెక్టర్ లక్ష్మీశ సూచనలు చేశారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.రాము తదితరులు పాల్గొన్నారు.

## దీపావళి టపాసులు కలిగిన వారికి లైసెన్స్ తప్పనిసరి

**సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏసుబాబు.**




**మచిలీపట్నం అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు పోలీసువారి విజ్ఞప్తి చేశారు. రాబోవు దీపావళి సందర్భంగా దీపావళి మందు గుండు సామాగ్రిని తయారు చేయువారు, అమ్మేవారు క్రింది సూచనలను తూచా తప్పకుండా పాటించాలి అని ఆర్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏసుబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా మందుగుండు సామాగ్రిని కలిగి ఉండడం గానీ, అమ్మడం గాని చేయరాదు అని తెలిపారు. అనుమతి లేకుండా మందు గుండు సామాగ్రిని తయారు చేయడం నేరంగా పరిగణిస్తామన్నారు. మందు గుండు సామాగ్రిని భద్రపరిచే ప్రదేశం / గోడౌన్ లకు లైసెన్స్ కలిగి ఉండాలని అలాగే అన్ని అనుమతులు కలిగి ఉండాలని తెలిపారు. పై నిబంధనలను ఎవరైనా అతిక్రమించిన ఎడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయి.

## వెంకన్నను దర్శించుకున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ...



**గుడ్లవల్లేరు:అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సన్మానించి... స్వామివారి చిత్ర పటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత ఆయన పేరిట స్వామి వారికి వేద పండితులు ప్రత్యేక పూజలను చేశారు.

## శ్రీ వెంకటేశ్వరునికి గరుడ సేవ....

**గుడ్లవల్లేరు:అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారికి పౌర్ణమిని పురస్కరించుకుని గరుడ సేవను చేపట్టారు. స్వామివారిని ప్రధాన వీధుల వెంబడి ఊరేగించారు. అడుగడుగునా మహిళా భక్తులు స్వామివారికి పండ్లు, టెంకాయలను సమర్పించి హారతులిచ్చి బ్రహ్మారథం పట్టారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహకులు చేపట్టారు. స్వామివారికి వేద మంత్రోచ్చరణ నడుమ ప్రత్యేక పూజలను చేసి వేద పండితులు ఊంజల్ సేవను నిర్వహించారు. స్వామివారి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.



## 10 వ డివిజన్ సుకర్లాబాద్ నందు రోడ్డుపై అక్రమ కట్టడాలు.

**చోద్యం చూస్తున్న సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ అధికారులు.**

**మచిలీపట్నం అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం స్థానిక సుకర్లబాద పదవ డివిజన్ నందు ప్రభుత్వ మున్సిపల్ స్థలము, డ్రైన్ పై శాశ్వత కట్టడాలు కడుతూ ప్రభుత్వ స్థలములో ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్న చోద్యం చూస్తున్న స్థానిక సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ అధికారులు. ఆక్రమణకు పాల్పడిన వ్యక్తి స్థానిక ప్రార్ధన మందిరానికి గురువు కావడం గమనార్హం... మంచి ,చెడు చెప్పాల్సిన గురువు కార్పొరేషన్ స్థలమును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడం పై స్థానికులు విమర్శిస్తున్నారు.సేకరించిన సమాచారం ప్రకారం 10 వ డివిజన్ సుకర్లాబాద్ మస్జిద్ రోడ్ లో మున్సిపల్ స్థలమును ఆక్రమించి శాశ్వత నిర్మాణం చేశారు. తన సరిహద్దులు నిర్మించిన ప్రహరీ గోడను దాటి మున్సిపల్ స్థలంలో కమర్షియల్ షాపు నిర్మించారు. రెండు నెలలుగా సాగుతున్న నిర్మాణమును కనీసం సచివాలయ ప్లానింగ్ సిబ్బంది, నగరపాలక సంస్థ అధికారులు అడ్డుకోలేదని స్థానికులు నుండి తీవ్రంగా విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణం చేపట్టడానికి కొంత మొత్తంలో చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే రోడ్లో స్థానిక ఇంటి యజమానులు కొందరు ఒకరికొకరు పోటీపడుతూ ఇల్లు కట్టడాలతో కార్పొరేషన్ రోడ్డును ఆక్రమించుకుంటున్నారు. పదవ డివిజన్ కూటమి ప్రభుత్వం లో ప్రజలకు పారదర్శకంగా పాలన అందిస్తానని గొప్పలు చెబుతున్న స్థానిక నాయకులు దీనిని పట్టించుకోకపోవడం అనేక విమర్శలకు దారితీస్తుంది. ప్రస్తుతం స్థానిక నాయకులు డివిజన్ లో కొంతమంది ఆక్రమణ కట్టడాల పై మౌనం వహిస్తే మునుముందు ఆక్రమణదారులు ఇంకెన్ని ఆక్రమణలకు పాల్పడుతారో?అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ స్థలములను అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించి , నగర పాలక సంస్థ స్థలములు, కాలువలు, డ్రైన్లు కబ్జా కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.





## సిఎంఆర్ఎఫ్ చెక్కలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని





**తిరుపతి :అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తిరుపతి రూరల్ మండలం పరిధిలోని తనపల్లి రఘునాథ్ రిసార్ట్స్ లోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తిరుపతి, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, చిన్నగొట్టుగల్లు, యర్రావారిపాలెం మండలాలకు సంబందించిన పలువురికి సిఎంఆర్ఎఫ్ సహాయనిధి ద్వారా సుమారు 26 లక్షల 29వేల 766 రూపాయలు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం. అనారోగ్య ,ఇతర సమస్యలతో బాధపడుతున్న విషయం స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే తక్షణమే స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనారోగ్య, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయాలని ఉన్నత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సిఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గారు. కష్టకాలంలో మా కుటుంబాలను ఆదుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నాని గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన భాధిత కుటుంబ సభ్యులు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షపునీటి నిల్వలు రోడ్డుపైన ఉండరాదు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వర్షపునీటి నిల్వలు రోడ్డుపైన ఉండరాదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం సాయంత్రం మహాత్మా గాంధీ రోడ్డు పర్యటించి క్షేత్రస్థాయిలో వర్షపునీటి నిల్వలను తొలగించే చర్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బుధవారం సాయంత్రం అరగంటలో 30 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని, మాన్సూన్ రెస్పాన్స్ టీం అప్రమత్తంగా ఉంటూ వర్షపు నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారని, అధికారులు వాటిని పర్యవేక్షిస్తున్నారని అన్నారు.

## మంచినీరు అందించడంలో ప్రభుత్వం విఫలం

**ప్రజల ప్రాణంతో చెలగాటమాడుతున్న ఎన్ టి పి పి ఎస్ చర్యలు తీసుకోవాలి**
**సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ**




**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 07(వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నా మంచినీటి సమస్యపై కొండపల్లి మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. త్రాగే మంచినీటిలో వీటీపీఎస్ బూడిద అలాగే పైపులైను తుప్పు పట్టడం వల్ల మురికి కాలువలో నీరు కలిసి ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కోవడం, ప్రజలు వైరల్ జ్వరాల వల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూ ఆసుపత్రులకు వేలకు వేలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, కృష్ణా నది కూత వేటు దూరంలో ఉన్న గ్రామాలకు మంచినీరు అందించలేని కూటమి ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ,స్థానిక మహిళలు పెద్ద ఎత్తున స్థానిక సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీసు ముందు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా సిపిఎం ప్రధాన కార్యదర్శి డివి కృష్ణ , సిపిఎం టౌన్ కమిటీ సభ్యులు షేక్ భాష,సీనియర్ నాయకులు ఆలేటి విట్టల్ రావు, వీటీపీఎస్ సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా సిలువ ప్రతిష్ట వార్షికోత్సవం



**రెడ్డిగూడెం అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి):** రెడ్డిగూడెం మండలం, రెడ్డిగూడెం గ్రామంలో జగ్గవరపుగుట్ట (రూపాంతరపుకొండ) పై సిలువ ప్రతిష్ట 19 వ వార్షికోత్సవ వేడుకలు సి ఎస్ ఐ సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రెవ జి విశ్వనాథ్ సారధ్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సి ఎస్ ఐ డీనరీ చైర్మన్ కలపాల బాబూరావు దైవ సందేశం అందించారు. అనంతరం భక్తులకు ప్రేమవిందు జరిగింది. ఈ కార్యక్రమంలో రెవ. రాజు, ఇస్సాకు, వర్కింగ్ కమిటీ మెంబర్ విశ్వనాధపల్లి ఇమ్మానుయేలు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఐడి కార్డులు పంపిణీ



**తోట్లవల్లూరు, అక్టోబర్ 8 (వార్తా ప్రభ):**విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని దేవరపల్లి ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీకా ఇమ్మానుయేల్ సూచించారు. స్థానిక పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత దేవరపల్లి చంద్రశేఖర్ ఐడి కార్డులను తయారు చేయించి బుధవారం అందజేశారు ఈ కార్డులను హెచ్ఎం ఇమ్మానుయేలు, ఎస్ఎంసి చైర్మన్ అప్పారావు విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఐడి కార్డులు అందించేందుకు ముందుకు వచ్చిన దాత చంద్రశేఖర్ ను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిబాబు చంద్రకళ, గుమ్మడి కోటయ్య, కాశి తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కులు పై అవగాహన కలిగి ఉండాలి

**ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కమీషన్ సౌత్ ఇండియా జోనల్ ప్రెసిడెంట్ చల్లా రమేష్ పిలుపు**



**అడ్డ తీగల, అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మానవ హక్కుల పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కమీషన్ సౌత్ ఇండియా జోనల్ ప్రెసిడెంట్ చల్లా రమేష్ పిలుపునిచ్చారు.మంగళవారం స్థానిక ఆదివాసీ భవనంలో హ్యూమన్ రైట్స్ సంస్థ రంపచోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ కోదండ వాసవి అధ్యక్షతన మానవ హక్కుల పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా కోద%శీ%డ వాసవి మాట్లాడుతూ గిరిజన ప్రాంత వాసులుగా ప్రతీ ఒక్క గిరిజనుడు మరియు గిరిజన స్త్రీలు తమ హక్కులు తాము తెలుసుకోవాలని కోరారు.చట్టం ద్వారా గిరిజనులకు అనేక హక్కులు సంక్రమించాయని వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు.ఏజన్సీ ప్రాంతంలో ఎవరికి ఏ అవసరం వచ్చిన తమని సంప్రదిస్తే మా వంతు సహకారం అందిస్తామని కోదండ వాసవి అన్నారు.సౌత్ ఇండియా మెడికల్ సెల్ జోనల్ ప్రెసిడెంట్ డాక్టర్ అవాల వీర మోహన్ మాట్లాడుతూ ముఖ్యంగా యువతీ,యువకులు మానవ హక్కులు పై మరింత అవగాహన పెంపొందించుకుని గిరిజన ప్రాంత అభివృద్ధికి కీలక పాత్ర పోషించాలన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర నాయకులు బళ్లా మోహన్,జలారి వీరభద్రరావు,తమదాల కృష్ణారెడ్డి,ఇతర నాయకులు పిఎంపి డాక్టర్ అభినందన్,కాకూరు వీరారెడ్డి,కెచ్చెల లింగారెడ్డి,రిటైర్డ్ టీచర్ ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

## వికేఆర్ కళాశాల విద్యార్థిని కీర్తిశ్రీ కి రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలలో వెండి పతకం

**గన్నవరం, అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి):**ఈనెల 7వ తేదీన విజయవాడ జిల్లాలోని మైలవరంలో జరిగిన కృష్ణ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలలో గన్నవరం వీకేఆర్ కళాశాల విద్యార్థిని పి కీర్తిశ్రీ (ఐబిఎస్సి) వెండి పతకాన్ని సాధించడం కళాశాలకు గర్వకారణమని కళాశాల ప్రిన్స్ పాల్ డి శ్రీనివాసరావు అన్నారు.బుదవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు తో పాటు అధ్యాపకులు, సిబ్బంది "కీర్తిశ్రీ కి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడు తూ కీర్తి సాధించిన విజయం వల్ల మన కళాశాలకు మంచి గుర్తింపు వచ్చింది అని ఇది మన కళాశాల కు గర్వకారణం అని అన్నారు. కీర్తి ఈ విజయం సాదించడానికి ఆమె కృషి పట్టుదల కారణమని అన్నారు. ఎవరైనా అంకితభావంతో కృషి చేస్తే విజయాలు తమ వెంట వస్తాయని కీర్తి ఋజువు చేసింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. శ్రీనివాస్, తేజకుమారి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



# శాసన వ్యవస్థ కమిటీలకు అధికారులు జవాబుదారితనం వహించాలి

● ఆదాయ వ్యయాలు ఖాతాల నిర్వహణ లో పారదర్శకత పాటించండి..... ● ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ కూన రవికుమార్ ● ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో ఏడు ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై సమీక్ష ● ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించిన కమిటీ

**విజయవాడ, అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఖర్చు చేసే ప్రతి పైసా గురించి ప్రభుత్వ రంగ సంస్థలు శాసన వ్యవస్థకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని ప్రభుత్వ రంగ సంస్థల సంఘం చైర్మన్ కూన రవికుమార్ అన్నారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఏడు ప్రభుత్వ రంగ సంస్థల పనితీరుపై బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరైన పియుసి చైర్మన్, సభ్యులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పియుసి చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ.... సొసైటీలతో కలిపి రాష్ట్రంలో సుమారు 236 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయని చెప్పారు. వీటికి సంబంధించిన వార్షిక ఆడిట్ నివేదికలు, ఆదాయ, వ్యయాలు, వాటి ఖాతాల (అకౌంట్స్) పై కమిటీ అధ్యయనం చేస్తుందని చెప్పారు. శాసన వ్యవస్థ స్టాట్యూటరీ కమిటీలలో ప్రభుత్వ లెక్కల సంఘం (పిఏసి), అంచనాల సంఘం, ప్రభుత్వ రంగ సంస్థల సంఘం (పియుసి) ఉన్నాయని చెప్పారు. కొన్నేళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థల సంఘం కాగితాలకే పరిమితమైందని, దీని గురించి సంస్థల ఉన్నతాధికారులకు కూడా అవగాహన ఉండడం లేదని అన్నారు. కొన్ని సంస్థల అధికారులు ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీ సిపిడిసిఎల్, ఏపీ ఆయిల్ ఫెడ్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ల నివేదికలను కూలంకషంగా చర్చించారు. ఏపీ సీపీడీసీఎల్ కు ప్రభుత్వం, ప్రజల నుంచి అందాల్సిన బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెక్యూరిటీ డిపాజిట్ మొత్తాన్ని ఎందుకు తిరిగి చెల్లించడం లేదని, ఎక్కువ వసూలు చేసి తక్కువ ఎలా తిరిగిస్తారని ప్రశ్నించారు? కమిటీ సభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. కరెంటు తీగలు తక్కువ ఎత్తులో ఉండటంవల్ల జి. కొండూరు మండలంలో ఒకరు చనిపోయారని వీటిపై దృష్టి పెట్టాలని సూచించారు. మరో సభ్యుడు అయితా బత్తుల ఆనందరావు మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు జారకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కొన్ని సందర్భాల్లో మానవ ప్రమాదాలు జరుగుతున్నాయని ఇలాంటివి జరగకుండా చూడాలని చెప్పారు. ఏపీ కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ లిమిటెడ్(ఏపీ ఆయిల్ ఫెడ్)... లాభాల్లో కొనసాగుతుండటంపై ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ అభినందనలు తెలిపింది.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ,ప్రభుత్వ రంగ సంస్థల సంఘం సభ్యులైన ఎమ్మెల్యేలు గౌతు శిరీష, అయితా బత్తుల ఆనందరావు,వర్ల కుమార్



రాజా, తెనాలి శ్రావణ్ కుమార్, వసంత కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, శాసనసభ సంయుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి నాగ మునెయ్య, విభాగాధికారి సతీష్, విజయవాడ ఆర్డీవో చైతన్య, డిఆర్ఓ ఎం. లక్ష్మీనరసింహం, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాణాసంచా పేలుడు ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం

● ప్రమాదం చాలా దురదృష్టకరం ● మృతుల కుటుంబాలకు సంతాపం



**రాయవరం, అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బుధవారం జరిగిన బాణాసంచా పేలుడు సంభవించన ప్రాంతాన్ని కూటమి పార్టీ సీనియర్ నాయకులు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఆర్డీవో అఖిల, పోలీసు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రమాదంలో మొత్తం ఏడుగురు చనిపోవడం, ముగ్గురు తీవ్రంగా గాయపడడం దురదృష్టకరమన్నారు. మృతి చెందిన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్, అధికారులను కోరారు. వాసంశెట్టి సత్యం వెంట కూటమి పార్టీ నాయకులు, ఎస్.కె పిపి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాస్టర్, ఉండవిల్లి శివ, చందమామ వాసు, కవల నానాజీ,కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, గడి గోవిందు తదితరులు పాల్గొని బాధిత కుటుంబ సభ్యులకు తమ సంతాపం వ్యక్తం చేశారు.



'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్సైట్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి

## రాజధానిలో మీడియా అవసరాలకు సహకరిస్తామని హామీ





**అమరావతి, అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి):** అమరావతి జర్నలిస్టులు రూపొందించిన 'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్సైట్ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరావతి ప్రెస్ క్లబ్ కమిటీకి, జర్నలిస్టులకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాజధాని ప్రాంతంలోని జర్నలిస్టులు అంతా కలిసి ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి ఏర్పాటు చేసుకోవడంతో పాటు నేడు వెబ్ సైట్ను రూపొందించుకోవడాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. అమరావతి నిర్మాణంలో ముఖ్యమంత్రి ఆలోచనల స్ఫూర్తితోనే 2018లో 'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' పురుడుపోసుకుందని కమిటీ సభ్యులు చెప్పారు. నాటి నుంచి ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి తరుపున పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ప్రభుత్వ సహకారంతో ఇప్పుడు అమరావతిలో ప్రెస్ క్లబ్ నిర్మాణం చేపట్టి...రాజధానిలో అమరావతి ప్రెస్ క్లబ్ను ఒక మంచి కేంద్రంగా గుర్తింపు తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని...ఈ క్రమంలో దేశంలో ఇతర రాష్ట్రాల్లో ఉన్న ప్రెస్ క్లబ్ లను కూడా పరిశీలించి డిజైన్లు రూపొందించామని కమిటీ సభ్యులు తెలిపారు. అమరావతి ప్రెస్ క్లబ్ ద్వారా రాజధానిలో మీడియా తనవంతు పాత్ర పోషించాలనేది తమ ఆకాంక్షగా వెల్లడించారు. ప్రెస్ క్లబ్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, జర్నలిస్టులు ముఖ్యమంత్రిని కోరగా...ఆయన సానుకూలంగా స్పందించారు. రాజధానిలో మీడియా అవసరాలు తీర్చడానికి సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి వెబ్ సైట్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ అప్పాజీ, జనరల్ సెక్రటరీ సతీష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ నారాయణ, ట్రెజరర్ కె.పూర్ణచంద్రరావు, జాయింట్ సెక్రటరీ మహేష్, కమిటీ సభ్యులు శ్యామ్ సుందర్, మల్లేశ్వరరావు, శ్రీనివాస్, కె.గాంధీబాబు, అనిల్ పాల్గొన్నారు

## కాలం చెల్లిన, నిషేధిత మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

ఔషధ దుకాణాల కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లాలోని ఔషధ దుకాణాల్లో కాలం చెల్లిన, నిషేధిత మందులు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ హెచ్చరించారు కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఔషధ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఔషధ దుకాణాల కార్యకలాపాలపై ఆరా తీశారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని స్పష్టం చేశారు. అనుభవం లేని వ్యక్తులు మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏ దుకాణంలోనైనా ఫార్మసిస్టులు లేకుండా ఔషధాలు విక్రయిస్తే చర్యలు తప్పన్నారు. తప్పనిసరిగా ప్రిస్క్రిప్షన్ ప్రకారం మాత్రమే ఫార్మసిస్టులు ఔషధాలు అందించాలని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని.. ఎప్పటికప్పుడు తనిఖీలకు సంబంధించి నివేదికలు అందించాలని ఆదేశించారు.

## ఉపాధి హామీలో పారదర్శకతకు ముఖ ఆధారిత హాజరు

- త్వరితగతిన శ్రామికుల ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తిచేయండి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఉపాధి హామీ పథకంలో పారదర్శకతను మరింత పెంచేందుకు, ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చేసేందుకు వేతనదారుల ముఖ ఆధారిత హాజరు ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆధార్ డేటా, ఈ-కేవైసీతో ఫేస్ అథెంటికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టర్ లక్ష్మీశ ఎంపీడీవోలు, డ్వామా అధికారులు, సిబ్బందితో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులను సమీక్షించడంతో పాటు పథకం అమల్లో పురోగతిపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఉపాధి శ్రామికుల ముఖ గుర్తింపు హాజరు నమోదుకు సంబంధించిన ఫేస్ - ఆర్డీ అండ్ ఎన్ఎంఎంఎస్ యాప్ను ఫీల్డ్ అసిస్టెంట్లు డౌన్లోడ్ చేసుకునేలా ఎంపీడీవోలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తించేందుకు అవసరమైన ప్రణాళికపై దృష్టిసారించాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు చూస్తే సగటు వేతనం విషయంలో గంపలగూడెం, కంచికచెర్ల, జగ్గయ్యపేట మండలాలు మొదటి మూడుస్థానాల్లో నిలిచాయని.. ప్రతి మండలం ఈ విషయంలో ప్రగతి చూపేందుకు కృషిచేయాలన్నారు. జిల్లాలో 2025-26లో 4 వేల ఎకరాల ఉద్యానపంటల సాగును లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటివరకు 3,745 ఎకరాలను గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా మునగ సాగుకు 880 ఎకరాలను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఉద్యాన పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది వివరించాలన్నారు. స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి కీలక ప్రగతి సూచికల్లో (కేపీఐ) పురోగతిపైనా అధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టే సీసీ రోడ్లు, పశువుల షెడ్లు, మ్యాజిక్ డ్రెయిన్లపైనా చర్చించి, కలెక్టర్ లక్ష్మీశ సూచనలు చేశారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.రాము తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ సహకారంతో బడ్డీకొట్టు, టిఫిన్, తోపుడు బళ్లు అందజేత

మంత్రి నారా లోకేష్కు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు





**మంగళగిరి :అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి, తాడేపల్లి పట్టణాలకు చెందిన పలువురికి టిఫిన్, తోపుడు బళ్లు, బడ్డీకొట్టును బుధవారం నాయకుల చేతుల మీదుగా అందజేశారు. మంగళగిరి 16వ వార్డుకు చెందిన చింతకింది జయలక్ష్మి, మంగళగిరి 24వ వార్డుకు చెందిన షేక్ దవాల్బికి టిఫిన్ బళ్లు, మంగళగిరి 3వ వార్డుకు చెందిన పేరం వరకుమారికి తోపుడు బండి అందజేశారు. అలాగే తాడేపల్లి 7వ వార్డుకు చెందిన దొంత ఉమామహేశ్వరికి బడ్డీ కొట్టు, డోలాస్ నగర్కు చెందిన గొర్లపాటి సుబ్బమ్మకు తోపుడు బండి అందజేశారు. త?మ కుటుంబ జీవనోపాధికి అవసరమైన బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు బళ్లు అందజేయాలని మంత్రి నారా లోకేష్ని కోరగా వెంటనే స్పందించిన ఆయన వెంటనే బళ్లు తయారు చేయించి నాయకుల చేతుల మీదుగా అందజేయించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షురాలు వాసా పద్మ, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, తాడేపల్లి 7వ వార్డు అధ్యక్షులు కుందుర్తి కోటేశ్వరరావు, తాడేపల్లి 9వ వార్డు అధ్యక్షులు బి కుమార పాల్గొన్నారు

## సెప్టెంబర్ 28న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం




బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 28న ముంబయిలో జరగనుంది. బీసీసీఐ అధ్యక్షుడు, ఐపీఎల్ ఛైర్మన్ సహా పలు పదవులకు ఎన్నికలే ప్రధాన అజెండాగా ఈ సమావేశం జరగనుంది. ఇటీవల బీసీసీఐ అధ్యక్ష పదవికి టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రోజర్ బిన్నీ రాజీనామా చేశారు. దీంతో ఆ పదవి ఖాళీగా ఉంది. అలాగే ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఛైర్మన్ అరుణ్ ధుమల్ ఆరు సంవత్సరాల పదవీ కాలం పూర్తయిన తర్వాత తప్పనిసరిగా కూల్ ఆఫ్ పీరియడ్కు వెళ్లే అవకాశం ఉంది. బీసీసీఐలో అన్ని కీలక పదవులకు ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ, అది కేవలం ఒక్క పదవికి మాత్రమే నిర్వహించే అవకాశాలున్నాయి. మిగతా వారు తమ పదవుల్లో మరికొంతకాలం కొనసాగే ఛాన్స్ ఉంది. రెండు సంవత్సరాల మూడు నెలలు బీసీసీఐ జాయింట్ సెక్రటరీగా, తొమ్మిది నెలలు సెక్రటరీగా.. మొత్తంగా దాదాపు మూడు సంవత్సరాలు పూర్తి చేసు కున్న దేవజిత్ సైకియా కార్యదర్శి పదవిలోనే కొనసాగ నున్నారు. గతంలో జైషా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ సంవత్సరం జనవరిలో సైకియా బీసీసీఐ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఈ సంవత్సరం మార్చిలో జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన రోహన్ గౌన్స్ దేశాయ్, జనవరిలో కోశాధికారిగా ఎంపికైన ప్రభతేజ్ భాటియా కూడా తమ తమ పదవుల్లో కొనసాగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

## శ్రీ సత్యదేవుని దేవస్థానాలకు ప్రవాసాంధ్రుల రూ.10లక్షల విరాళం...



**గుడ్లవల్లేరు:అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానాల ఆధునికీకరణ పనులకు బుధవారం లండన్లో స్థిరపడిన దాతలు గుడ్లవల్లేరు వాస్తవ్యులు రూ.10లక్షల విరాళం అందించారు. డాక్టర్ సూర్యదేవర యదు పూర్ణచంద్రరావు, డాక్టర్ జాహ్నవి దంపతులు, వారి కుమారులు డాక్టర్ ఎస్.వంశీ సుచేత్రావు, డాక్టర్ ఎస్.సందీప్రావు, వల్లభనేని శోభనాద్రి స్మారకార్థం కుటుంబ సభ్యులు ఈ భూరీ విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్యచౌదరి, గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, సభ్యులు పోలవరపు వెంకట్రావు, వల్లభనేని బుడ్డిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగెళ్ల నాగేశ్వరరావు, వైపీసీ ప్రసాద్, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ అవార్డు గ్రహీతకు మున్సిపల్ చైర్మన్ అభినందనలు



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 8 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపాలిటీ స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ అవార్డు గ్రహీతకు పలువురు అభినందనలు తెలిపారు. కొండపల్లి మున్సిపాలిటీ మెప్మా విభాగానికి చెందిన శ్రీరామ స్లమ్ లెవెల్ ఫెడరేషన్ లక్ష్మి ఎస్ హెచ్ జీ సభ్యురాలు ఎస్.విజయలక్ష్మి స్వర్ణ ఆంధ్రా - స్వచ్ఛాంధ్రాలో భాగంగా టెర్రస్ గార్డెనింగ్ నిర్వహించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్ నుంచి అవార్డు అందుకున్నారు. కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీత విజయలక్ష్మిని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమాఖ్యలో సభ్యులు అవార్డు గ్రహీత విజయలక్ష్మిని ఆదర్శంగా తీసుకుని టెర్రస్ గార్డెనింగ్ చేస్తూ అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం శ్రీధర్, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

## జిల్లా వైసీపీ పరిశీలకులు మోదుగుల ని కలిసిన చేని కుమారి, రాంబాబు దంపతులు



**పెనుగంచిప్రోలు, అక్టోబర్ 8( వార్త ప్రభ)** విజయవాడ లో ని.యం. కన్వెన్షన్ హాల్ ఈరోజున ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ ని,ఎన్టీఆర్ జిల్లా పార్టీ వైసీపీ పరిశీలికులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి ని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం లో మర్యాదపూర్వకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి ఎన్టీఆర్ జిల్లా బిసి సెల్ ఉపాధ్యక్షులు చేని రాంబాబు దంపతులు కలిసి,వారికి అభినందనలు తెలియజేశారు..

## మాజీ మంత్రి జోగి రమేష్ పై కేసు నమోదు

**ఇబ్రహింపట్నం,అక్టోబర్ 07 (వార్తా ప్రభ ప్రతినిధి):** మాజీ మంత్రి మరియు మైలవరం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ జోగి రమేష్ పై ఇబ్రహింపట్నం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది.సోమవారం నకిలీ మద్యం కేసులో పాత ఏఎన్ఆర్ బార్ వద్ద అధికారుల తనిఖీ సమయంలో అక్కడికి తన అనుచరులతో వెళ్లి హల్చల్ చేసిన జోగి రమేష్. దీనికి సంబంధించి జోగి తో పాటు 30 మంది పై ఇబ్రహింపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు.

## నంబర్లు ఆట ఆడుతున్న నలుగురు వ్యక్తులు అరెస్ట్

రూ.3300 లు స్వాధీన పర్చుకున్న పోలీసులు

**జి.కొండూరు : అక్టోబర్ 8 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నంబర్లు ఆట ఆడుతున్న నలుగురు వ్యక్తులను స్థానిక పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు.జి.కొండూరు మండలంలోని చెవుటూరు శివారు 30వ జాతీయ రహదారి బైపాస్ లో వై జంక్షన్ వద్ద నలుగురు వ్యక్తులు రహదారిపై వచ్చే పోయే వాహనాల నంబర్లు ఆట ఆడటం చూసిన స్థానిక పోలీసులు వారిని అరెస్ట్ చేసి వారినుచి రూ. 3300 లు స్వాధీనం చేసుకున్నారు. ఏ ఎస్ ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భారత ప్రధాన న్యాయమూర్తిని అవమానించడం బాధకరం

## –తీవ్రంగా ఖండించిన 'ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్'

**తిరుపతి,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** భారత ప్రధాన న్యాయమూర్తి పై జరిగిన అనుచితమైన, బాధాకరమైన చర్యలను ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. న్యాయవ్యవస్థ గౌరవాన్ని దిగజార్చే ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని సంఘం స్పష్టం చేసింది.న్యాయ విధులు, న్యాయస్థానాల పరిపూర్ణతను కాపాడడం ప్రతి న్యాయవాది బాధ్యత అని ఐ ఏ ఎల్ పేర్కొంది. ఈ మేరకు ఐ.ఏ.ఎల్. రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం యాదవ్ మరియు చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు రాజమాణిక్యం లు సంయుక్తంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ప్రధానంగా పలు విషయాలు నొక్కి చెప్పారు "భారత ప్రధాన న్యాయమూర్తి గారిని ఎటువంటి అనుచితమైన, బాధాకరమైన చర్యలతో అవమానించడాన్ని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ తీవ్రంగా ఖండిస్తుందనీ, న్యాయ వృత్తిపట్ల గౌరవం, బాధ్యత మరియు విలువలను పరిరక్షించడమే తమకు ప్రతిపాద్యమని వారు ఆ ప్రకటనలో తెలిపారు. న్యాయవిధుల గౌరవాన్ని దిగజార్చే స్వార్థపూరిత, దురుసైన ప్రవర్తనను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఖరాఖండీగా వారు చెప్పారు. రాజ్యాంగ విలువలను, న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని రక్షించడం, న్యాయస్థానాల పరిపూర్ణతను నిలుపుకోవడం అందరూ అనుసరించాల్సిన బాధ్యత అని వారు గుర్తుచేశారు. ఈ ఘటనను ప్రభుత్వాధికారులు, న్యాయసంస్థలు తక్షణమే సీరియస్‌గా పరిగణించి, సదరు వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున డిమాండ్ చేశారు. భావప్రకటన స్వేచ్ఛ అనేది చట్టబద్ధంగా నిర్దిష్టమైన పరిమితుల్లో ఉండాలని, న్యాయవ్యవస్థ గౌరవానికి విఘాతం కలిగించే విధంగా దాన్ని వినియోగించరాదని హితవు పలికారు.ముగింపులో, ఐ.ఏ.ఎల్. భారత ప్రధాన న్యాయమూర్తి గారికి, భారత్ గర్వించదగిన న్యాయవ్యవస్థకు సంపూర్ణ సంఘీభావాన్ని ఐ ఏ ఎల్ తెలియజేసింది. న్యాయ సంస్థ గౌరవాన్ని, సమాజ విశ్వాసాన్ని పరిరక్షించేందుకు ప్రతి న్యాయవాది కట్టుబడవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# అర్హులైన పేద, మధ్య తరగతి వర్గాల సొంతింటి కలను నిజం చేస్తాం.. ఎమ్మెల్యే రాము

## ● పిఎంఎవై పథకం విధివిధానాలపై.. అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే..



**గుడివాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా పేదల ఇళ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టి పెట్టారు. త్వరలో చేపట్టనున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిర్మాణాలపై హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే రాము ప్రజా వేదిక కార్యాలయంలో సమీక్షించారు. పిఎంఎవై విధి విధానాలు పూర్తిస్థాయిలో వచ్చిన తర్వాత గుడివాడ పట్టణం మరియు గ్రామీణ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో హౌసింగ్ అధికారులు పర్యటనలు చేపట్టాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరు పథకానికి దరఖాస్తులు చేసుకునేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు హౌసింగ్ శాఖ కార్యాలయ పని వేళల్లో, ఉద్యోగులు అందుబాటులో ఉండాలని అధికారులతో ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేద మధ్య తరగతి వర్గాల సొంతింటి కలను నిజం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా హౌసింగ్ అధికారులు జవాబుదారీ తరంతో పని చేయాలని ఎమ్మెల్యే రాము అన్నారు. నియోజకవర్గం లోని అర్హులందరికీ పిఎంఎవై చేరువయ్యేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. పేద మధ్యతరగతి వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వా లక్ష్యమని ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డి. ఈ. ఈ శివ ప్రసాద్, ఏ. ఈ లు సురేంద్ర, సాయి పవన్, పృధ్వి, నాగేశ్వరరావు లు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ధాన్యం సేకరణ ప్రక్రియ పై తరచుగా అవగాహన కల్పించాలి - కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్

## ● 2025 -26 ధాన్యం సేకరణకు పక్కా ప్రణాళిక.. గుడివాడ ఐఎంఏ హాల్‌లో అధికారులకు, సిబ్బంది.. లకు ధాన్యం సేకరణపై అవగాహన - సాంకేతిక శిక్షణా కార్యక్రమం..





**గుడివాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** గుడివాడ డివిజన్ పరిధిలోని ఏడు మండలాలకు సంబందించిన సంబంధిత గ్రామ మరియు జిల్లా అధికారులకు కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్. నవీన్ అధ్యక్షతన స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలు నందు ధాన్యం సేకరణ పై అవగాహన మరియు సాంకేతిక శిక్షణా కార్యక్రమం ఉదయం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో 287 రైతు సేవ కేంద్రాలు ఏర్పాటు చేయటంతో పాటుగా ధాన్యం సేకరణకు వినియోగించుటకు కావలసిన అన్నీ పరికరాలు (వస్తు, సామాగ్రి) వుంచటంతో పాటుగా అందులో సిబ్బంది నియామకం కూడా పూర్తి అయ్యిందని తెలిపారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సంబంధిత అధికారులు అందరు కూడా కష్టపడి పనిచేసి ధాన్యం సేకరణలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటుగా రైతులు అందరకు సకాలంలో సక్రమంగా అత్యుత్తమ సేవలు అందించాలని కోరారు. ఈ ఖరీఫ్ సీజన్ 2025–26 కు ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర ప్రతి క్వింటాలకు సాధారణ రకం –2369, గ్రేడ్ –ఏ –2389 కల్పించటం తో పాటుగా గన్నీస్, లేబర్ మరియు ట్రాన్స్ పోర్ట్ వంటి అదనపు ప్రయోజనాలను కల్పించుటకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనితో పాటుగా ధాన్యం నాణ్యత ప్రమాణాలకు లోబడి రైతులు ఆరబెట్టుకుని, శుద్ధిపరచుకుని ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధర వుండవలసిందిగా పై విషయాలపై గ్రామ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు తరచుగా గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ ప్రక్రియ పై వారికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇదే క్రమంలో జిల్లా లోని జిల్లా స్థాయి కమిటీలు, డివిజన్ స్థాయి కమిటీలు, మండల స్థాయి కమిటీలు, గ్రామ స్థాయి కమిటీలు ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షిస్తారని సమస్యలను అధిగమించాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఈ రోజు గ్రామ స్థాయి కమిటీ సభ్యులైన గ్రామ వ్యవసాయ సహాయకులు, సాంకేతిక సహాయకులు, డాటా ఎంట్రీ ఆపరేటర్ మరియు రైస్ మిల్లు దగ్గర నియమించినటువంటి కస్టోడియన్ అధికారులు (భద్రతాధికారి) లకు మరియు రైస్ మిల్లు నందు పనిచేయు సిబ్బందికి ధాన్యం సేకరణ పై పూర్తి స్థాయిలో అవగాహన మరియు సాంకేతిక శిక్షణా కార్యక్రమం నిర్వహించుటతో పాటుగా ఎప్పటికప్పుడు నిరంతరం పర్యవేక్షణలో భాగంగా అధికారులు అందరు అప్రమత్తంగా వుండాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులకు ధాన్యం సేకరణపై అవగాహనతో పాటుగా వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశగా తప్పకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి సుబ్రహ్మణ్యం, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి. శివరామ ప్రసాద్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మోహన్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, జిల్లా సహాయ సహకారి అధికారి చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, ఏడు మండలాలకు సంబందించిన తహశీల్దార్లు, వ్యవసాయ అధికారులు, సహకార శాఖ అధికారులు, పౌర సరఫరాల డిప్యూటీ తహశీల్దార్లు మరియు రైస్ మిల్లర్లు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం కు 10 వేల 116/ రూపాయలు విరాళం..



**పెనుగంచిప్రోలు,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు అన్నదానం కు ఎన్టీఆర్ జిల్లా, నందిగామ మండలం మరియు పట్టణ వాస్తవ్యులు ఎస్ కే డి వి.ప్రసాద్ రావు, రాజకుమారి దంపతులు శ్రీ అమ్మవారి దేవస్థానం నిత్య అన్నదాన పథకమునకు10,116 రూపాయలు విరాళము ఆలయ సూపరింటెంట్ ఎల్ లక్ష్మణ్ కి అందజేశారు, వారికి ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ ఆలయ అర్చకులు వేద పండితులచే ఆశీర్వచనం చేసి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు....

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: డాక్టర్ రత్నాకర్




**కాకినాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,సిబిఎం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ముత్తా బత్తుల రత్నకుమార్ పేర్కొన్నారు.సి.బి.ఎం. మహిళా కళాశాల ఆధ్వర్యంలో సే నో టు డ్రగ్స్ అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా.రత్నకుమార్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మద్యం,ధూమపానం, సేవించ రాదని,వాటివల్ల సమాజంలో విలువలు కోల్పోతారని కావున విద్యార్థి దశలో శ్రద్ధా విద్యనభ్యసించిన ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కస్పాండెంట్ డాక్టర్ .ముత్తాబత్తుల రత్నకుమార్ ,ప్రిన్సిపాల్ క్రాంతి రేఖ,అధ్యాపక సిబ్బంది,అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థులు డ్రగ్స్ తీసుకోవడం ద్వారా జరుగుతున్న సమస్యలపై వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక శోభతో వెల్లి విరస్తున్న బాపులపాడు మండలంలోని దేవాలయములు



శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానం బాపులపాడు



శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం రంగయ్యప్పారావుపేట



**హనుమాన్ జంక్షన్,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో సర్వాంగ సుందరముగా వేంచేసి భక్తులు కోరినదే వారి క్రొంగుబంగారమై వారి కోరికలను తీరుస్తూ హనుమాన్ జంక్షన్ మరియు పరిసర గ్రామములకు క్షేత్రపాలకుడిగా శ్రీ అభయాంజనేయ స్వామి వారు అలరారుతున్నారు. ఈ దేవాలయంలో ముఖ్యంగా ప్రతినిత్యము త్రికాల అర్చనలు, త్రికాల హారతులు, త్రికాల నివేదనలు, జరుపుతూ వార్షికముగా హనుమజ్జయంతి శ్రీరామనవమి విశేషముగా పర్వదినాలుగా జరుపుకుంటారు. ప్రతినిత్యం ఉదయం 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు సుమారుగా 2000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని వారి యొక్క ఇష్టకామ్యములను నెరవేర్చుకుంటూ ఉంటారు. ఆ స్వామివారి దర్శన భాగ్యము చేతనే భక్తుల చాలా పారవస్యాన్ని పొందుతూ ఉంటారు. ఈ దేవాలయం నందు ప్రతి మంగళవారము సుమారుగా 300 మంది వరకు అన్న ప్రసాదాన్ని వితరణ చేస్తూ ఉన్నారు. బాపులపాడు గ్రామము నుండి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రంగయ్య అప్పారావుపేట గ్రామమునందు సుమారుగా 70 సంవత్సరముల పూర్వం గ్రామస్తుల సహాయ సహకారములతో దాతల సహకారంతో గ్రామస్తులు శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ కోదండరామ స్వామి వారిని ప్రతిష్టించి ఉన్నారు ఆనాటి నుండి గ్రామస్తులు స్వామివారిని దర్శిస్తూ సేవిస్తూ స్వామి అనుగ్రహ పాత్రులైతరిస్తూ ఉన్నారు. కాలక్రమంలో ఆలయంలో కొన్ని మార్పులు చేర్పులు నూతన నిర్మాణాలు చేపట్టబడి రావడంతోటి 2024 శ్రావణమాసంలో నూతన నిర్మాణాలకు శ్రీకారం చుట్టి సుమారుగా 20 లక్షల రూపాయల పైబడి వ్యయముతో నూతన శోభను సంతరించుకొని కుంభాభిషేక కార్యక్రమాలను జరుపుకొని ఈ రోజున స్వామివారి దేవాలయము నందు ప్రతి నిత్యము 66 మంది భక్తుల గోత్రనామాలతో అర్చనాధి కార్యక్రమాలు నిర్వహించుట మరియు భక్తుల సహాయ సహకారంతో ప్రతినిత్యం ప్రసాదము తయారు చేయించుట మరియు ప్రతి మంగళవారము శనివారము దేవాలయము నందు భక్త బృందముల చేత హనుమాన్ చాలీసా సుందరాకాండ పారాయణ మణిద్వీప వర్ణన శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమాలు నిరంతరము జరుపబడుతున్నాయి ఈ దేవాలయము నందు శ్రీరామనవమి, ముక్కోటి ఏకాదశి, హనుమాన్ జయంతి , దసరా, కార్తీక మాసం, ధనుర్మాసం ధనుర్మాసంలో ఉత్సవములను, దాతల సహాయ సహకారములతో చాలా వైభవంగా నిర్వహిస్తూ ఉంటారు. ప్రతి మాసము పునర్వసు నక్షత్రం రోజున విశేష పంచామృతాభిషేకములు జరిపి విశేష అలంకారములు చేసి భక్తుల గోత్రనామములతో పూజాధి కార్యక్రమములు నిర్వహిస్తూ అన్న ప్రసాద వితరణ చేస్తున్నారు. పరమశివుని జన్మ నక్షత్రం ఆరుద్ర నక్షత్రం రోజున స్వామివారికి పంచామృత అభిషేకం, అన్నాభిషేకం నిర్వహిస్తున్నారు.స్వామివారికి ప్రతినిత్యం భక్తులు పూలకైంకర్యములు, ప్రసాద కైంకరియములు జరిపిస్తూ ఉంటారు. అంతేకాకుండా సీతారామచంద్రస్వామి వారికి మరియు గ్రామ దేవత అయిన గంగానమ్మ తల్లికి ఆషాడమాసంలో సారే సమర్పిస్తూ ఉంటారు ఈ కార్యక్రమంలో వందల కుటుంబాలు పాల్గొని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 9సార్లు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాలను శ్రీ కోదండరామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ, అర్చక స్వామి సామవేదం అరుణ్ కుమార్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. హనుమాన్ జంక్షన్ విజయవాడ రోడ్డు వేలేరు గ్రామ ముఖ సింహద్వారం నందు సర్వాంగ సుందరముగా వేంచేసి ఉన్న శ్రీ వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి మరియు శ్రీ సీతారామచంద్ర స్వామి వారు ఒకే ప్రకారములో కొలువై ఉంటారు. ఈదేవాలయంలో భద్రాచలం క్షేత్రములో కొలువై ఉన్నట్లుగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారు అమ్మవారిని ఒడిలో కూర్చోబెట్టుకుని ఆజానుబాహుడు అన్న మాటకు సార్ధకతను చేకూరుస్తూ స్వామివారి ఎనిమిది అడుగులు ఆజానుబాహుడుగా నిత్యనిరాజనాలు అందుకుంటూ ఉంటారు. అలాగే ఇక్కడ ఉన్నటువంటి వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి వారు వేలేరు గ్రామ పెద్దలచే పూర్వంలో ప్రతిష్టించబడి ఉన్నారు. కార్యక్రమంలో 2006లో శ్రీమాన్ కనుమూరి సూర్యనారాయణ రాజు గారి దంపతులు మరియు, దొనవల్లి గురునాథం గారు, యనమదల లోకేశ్వర వీరరాఘవరావు గారు, డాక్టర్ అవీర్నేని నారాయణరావు గారు, మరియు కొంతమంది దాతల సహాయ సహకారములతోటి పునర్నిర్మాణంలో భాగంగా నూతన ఆలయాన్ని నిర్మించి ప్రతిష్టించారు. ఈ దేవాలయాల సముదాయంలో ఉగాది, శ్రీరామనవమి, హనుమజ్జయంతి, ముక్కోటి ఏకాదశి, వినాయక చవితి పండుగలు చాలా విశేషముగా నిర్వహిస్తూ ఉంటారు. ప్రతి మాసము వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి వారికి హస్తా నక్షత్రము మరియు సంకష్టహర చతుర్ధి రోజున పంచామృత అభిషేకము విశేష అలంకారములు అర్చనలు నిర్వహించబడుతూ ఉంటాయి. శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి పునర్వసు నక్షత్రం రోజు, పూర్వాభాద్ర నక్షత్రము పంచముఖ ఆంజనేయస్వామి వారికి, ఈ ప్రాంగణంలో కొలువైయున్న సరస్వతి అమ్మవారికి మూలా నక్షత్రం రోజున విశేషముగా పంచామృత అభిషేకములు నిర్వహించి అర్చనాధి కార్యక్రమంలో నిర్వహిస్తూ ఉంటారు. ఈ సముదాయము నందు హనుమాన్ జయంతి రోజు హనుమాన్ జంక్షన్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శ్రీమాన్ కనుమూరి సూర్యనారాయణ రాజు గారు సుమారుగా 25 వేల మందికి పైగా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉంటారు ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి యొక్క అన్నప్రసాదాన్ని భక్తితో స్వీకరించి భక్తిని చాటుకుంటూ ఉంటారు ఈ అన్నదాన కార్యక్రమం గత 45 ఏళ్లుగా నిర్వహిస్తూ ఉన్నారు. ఈ దేవాలయం నందు ప్రతి మాసము పూర్ణిమనాడు ఒక విశేషమైన హెూమాన్ని యాజమాన్యం వారు నిర్వహిస్తున్నారు. బాపులపాడు గ్రామం నందు గత 27 సంవత్సరముల క్రితం శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవాలయాన్ని మేడేపూడి వారి వంశస్థులు ప్రతిష్టించి ఉన్నారు. ఆరోజు నుండి ఈరోజు వరకు శ్రీ దాసాంజనేయ స్వామివారిని భక్తులు ప్రతినిత్యం దర్శించి స్వామి వారి యొక్క అనుగ్రహాన్ని పొందుతూ ఉన్నారు. ఈ దేవాలయం నందు స్వామివారిని దర్శించినంత మాత్రము చేతనే వారు కోరినటువంటి కోరికలు తీరి భక్తులు స్వామి వారి యందు భక్తిని చాటుకుంటూ ఉంటారు. దానిలో భాగంగానే కోరికలు తీరినటువంటి భక్తులు స్వామివారికి వెండి ఆభరణములు అనగా వెండి తమలపాకుల దండలు మరియు వెండి రామ మాడలతో తయారు చేయించినటువంటి దండలు, మరియు స్వామి వారికి వెండి సర్వాభరణములు, వెండి కడియములు, బంగారపు నేత్రములు, వెండి తీర్థ పాత్రలు, వెండి పళ్ళెములు తయారు చేయించి స్వామివారికి సమర్పించి స్వామి వారి యొక్క అనుగ్రహములు పొందుతూ ఉంటారు. శ్రీ దాసాంజనేయ స్వామి వారి యందు ఆచంచలమైనటువంటి భక్తిశ్రద్ధలతో 2025 ఫిబ్రవరి 2వ తారీఖున సుమారుగా 20 లక్షల రూపాయల వ్యయముతోటి నూతన జీవధ్వజ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా భక్తులు దాతలు వారి వారి సహాయ సహకారములతో ప్రతిష్ట కార్యక్రమాన్ని జరిపించి ఉన్నారు. ఈప్రాకారములోనే శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయమునకు 2005 వ సంవత్సరంలో శంకుస్థాపన చేసి, 2006 ఫిబ్రవరి 8వ తారీఖున స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని దాతల సహాయ సహకారములతో అంగరంగ వైభవముగా జరిపించడం జరిగింది. ఆనాటి నుండి శ్రీ బాబా వారిని భక్తులు దర్శిస్తూ ఉంటారు. ప్రతి నిత్యము నాలుగు హారతులు సమర్పిస్తూ ఉంటారు. ప్రతి గురువారము భక్తులు బాబా వారికి పంచామృత అభిషేకములు, పూజా కార్యక్రమంలోనిర్వహిస్తూ ఉంటారు. ప్రతి గురువారము ధర్మకర్తలు దాతల సహకారముతో 400 మంది భక్తులకు స్వామివారి అన్న ప్రసాద వితరణ జరుపుతారు. అన్నదాన కార్యక్రమంలో భక్తుల పెద్ద ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తారు. బాపులపాడుమండలంలో పిరికీడు గ్రామం నందు శ్రీముక్తి కాంతా సమేత శ్రీ ముక్తేశ్వర స్వామి వారి దేవాలయము చాలా ప్రసిద్ధి చెందినటువంటిది ఏ దేవాలయంలో శ్రీముక్తేశ్వర స్వామి వారు భక్తులను కటాక్షిస్తూ ఉంటారు స్వామివారికి ప్రతి ఆరుద్ర నక్షత్రం రోజున పంచామృత అభిషేకములు భక్తులు శ్రద్ధగా జరిపిస్తూ ఉంటారు దేవాలయము నందు విశేషముగా మహాశివరాత్రి శివ ముక్కోటి ఆరుద్రోత్సవములు జరుపుతూ ఉంటారు కార్తీకమాసంలో దశ సహస్ర దీపారాధన మహోత్సవమును కనుల విందుగాచాలా విశేషముగా భక్తుల సహాయ సహకారములతో జరుపుతూ ఉంటారు. అదేవిధంగా మహాశివరాత్రి రోజున స్వామివారికి శివ కళ్యాణ మహోత్సవాన్ని చాలా వైభవంగా నిర్వహిస్తారు మరియు లింగోద్భవ కాలంలో పరమేశ్వరుడికి అభిషేక కార్యక్రమాన్ని చాలా విశేషంగా నిర్వహిస్తూ ఉంటారు. బాబులపాడు మండలం బాపులపాడు గ్రామం హనుమాన్ జంక్షన్ నూజివీడు రోడ్డులో శ్రీ అలర్మేలుమంగ పద్మావతి సమేత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయము నందు నిత్యము భక్తులు స్వామివారిని దర్శించుకుని పరవశం పొందుతూ ఉంటారు. ఈ దేవాలయం నందు వార్షిక బ్రహ్మోత్సవములు చాలా విశేషంగా నిర్వహిస్తూ ఉంటారు ప్రతి మాసము శుద్ధ ఏకాదశి రోజు రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతములు మరియు బహుళ ఏకాదశి రోజు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వ్రతములు నిర్వహిస్తూ ఉంటారు. ఈ రెండు పర్యాయములు కూడా భక్తులు ఉచిత పూజా సామాగ్రి స్వీకరించి స్వామి వారి యొక్క వ్రతకైకరియా మనలో భాగస్వాములై స్వామి వారిని సేవించి దర్శించి స్వామివారి అనుగ్రహ పాత్రులైతరిస్తూ ఉంటారు. ఈ దేవాలయము నందు ప్రతి శనివారము, దాతల సహకారముతో స్వామివారి అన్న ప్రసాదాన్ని వితరణ చేస్తూ ఉంటారు. భక్తులు స్వామివారి యందు శ్రద్ధ భక్తితో అన్నప్రసాదాన్ని స్వీకరించి తరిస్తూ ఉంటారు. బాబులపాడు మండలంలోని ఓగిరాల రామాలయంలో పండగ పర్వదినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.. కానుమోలు గ్రామంలో రామస్వామి దేవాలయంలో, శివాలయంలో పండుగ పర్వదినాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. అప్పారావుపేట అడ్డరోడ్ వేంచేసి ఉన్న దాసాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి పదివేల మందికి పైగా అన్న ప్రసాదం వితరణ చేస్తున్నారు... ఈ కార్యక్రమాన్ని హనుమాన్ ట్రేడర్స్ అధినేత పొట్లూరి సీతారాం ప్రసాద్ సొంత నిధులతో నిర్వహిస్తున్నారు.

# క్యాన్సర్ వ్యాధిపై అవగాహనా సదస్సు నిర్వహణ




**గుడివాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** బుధవారం లయన్స్ క్లబ్ ప్రగతి ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన సదస్సు బిల్లపాడు హైస్కూల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ ఎన్ని రకాలుగా వస్తుంది దాని నివారణ గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రగతి అధ్యక్షులు మాదల సురేష్ కార్యదర్శి పామర్తి కేశవరావు ఉపద్రష్ట రాంబాబు మహంకాళి వీర శేఖర్ గవర్నర్ ఏరియా రెప్రజెంటు రామదేని వేణుబాబు నల్లారి శేషగిరిరావు స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి నాగేశ్వరావు అధ్యాపక సిబ్బంది ఏఎన్ఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికి సురేష్ కృతజ్ఞతలు తెలియజేసారు.

# కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు సేవలు అభినందనీయం..

## -అంగన్వాడీ కేంద్రంలో దుప్పట్లు, వంట పాత్రలు వితరణ..




**గుడివాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) :** బుధవారం శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు సహకారంతో స్థానిక నీలామహల్ రోడ్ లోని అల్లం బడి స్కూల్లో ఉన్న అంగన్వాడి కేంద్రానికి చాపలు, దుప్పట్లు, స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు అందజేశారు. ఈ సందర్భంగా హరికుమార్ యాదవ్ మాట్లాడుతూ నాగరాజు గారు గత పది రోజులు క్రితం ధనియాల పేటలో ఉన్న అంగన్వాడీ కేంద్రానికి వంట పాత్రలు ఇచ్చారు. అలాగే అడగగానే అంగన్వాడీ కేంద్రానికి సంబంధించిన చాపలు దుప్పట్లో ప్లేట్లు గ్లాసులు ఏర్పాటు చేసినందుకు వారికి శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం తరపున వారికి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ విజయ దుర్గ దేవస్థానం సభ్యులు కోడూరి ప్రభు, తెలుగుదేశం నాయకులు గొర్రెల నరేంద్ర కుమార్, పోలవరపు శ్రీనివాసరావు, చందు శ్రీనివాసరావు, స్కూల్ హెచ్.ఎం బి. నాగ రాజేశ్వరి, అంగన్వాడీ టీచర్స్ రమా, పైడమ్మ మరియు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



గుడివాడ మం।। చౌటపల్లి శాఖా గ్రంధాలయము లో బహుముఖ ప్రజ్ఞా శాలి స్వాతంత్ర్య సమరయోధుడు రచయిత కళాకారుడు నాటక కర్త శ్రీ అడవి బాపిరాజు జయంతి కార్యక్రమం బుధవారం ఉదయం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకుడు జీ రత్న చంద్ర, సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.
–గుడివాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) :

# ఒంగోలు మార్కెట్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన వెంకట్రావు కు బీసీ, యాదవ నేతల ఘన సత్కారం



ఒంగోలు,అక్టోబరు 8 (వార్తాప్రభ) : ప్రకాశం జిల్లా కేంద్రంలో ప్రతిష్టాత్మకమైన ఒంగోలు మార్కెట్ యార్డ్ చైర్మన్ గా బి.సి., యాదవ ఆత్మబంధువు, శ్రీశైలం దేవస్థానం యాదవ అన్నదాన సత్ర సలహా మండలి గౌరవాధ్యక్షులు రాచగర్ల వెంకట్రావు నేడు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా వారిని కలిసి గజమాలతో శ్రీశైలం యాదవ అన్నదాన సత్రం అభివృద్ధి కమిటీ ఘనంగా సత్కరించింది. అనేక సంవత్సరాలుగా శివపురం గ్రామ సర్పంచ్ గా ఉన్నటువంటి యాదవ కులంలో సమైక్యాంధ్ర రాష్ట్రంలో గుర్తింపు పొందినటువంటి నాయకుడు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడిగా పనిచేసినటువంటి వెంకట్రావు యాదవ్ రాష్ట్రంలో యాదవులందరికి ఆత్మబంధువుగా ఒంగోలులో నిలిచారు. అనేక కష్టనష్టాలు కోర్చి ఒంగోలు కేంద్రంగా జిల్లాలో ఉన్నటువంటి యాదవులందరికి అండగా ఉంటూ ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా తన వంతు బాధ్యతగా స్పందిస్తూ... ఆయా ప్రాంతాలకు వెళ్లి బాధితులను పరామర్శించి వారికి అండగా నిలిచినటువంటి చరిత్ర కలిగినటువంటి సిరిపురం వెంకట్రావు గా పేరు గాంచిన వెంకట్రావు యాదవ్ అత్యంత అభినందనీయుడని అఖిల భారత యాదవ మహా సంఘం జాతీయ నాయకులు పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్ తెలియజేశారు. వెంకట్రావు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మార్కాపురం డివిజన్ నుంచి సుమారు పది వాహనాల్లో యాదవ సోదరులందరూ కూడా తరలి వచ్చారని, జిల్లాలోని అనేక ప్రాంతాల నుండి విరివిగా వాహనాలు వచ్చాయని పి.ఎల్. పి.తెలియజేశారు. సుమారు 5000 మందితో జరిగినటువంటి ర్యాలీలో సిరిపురం వెంకట్రావు యాదవ్ కు ఘనసత్కారం చేశామని కాటంరాయ దేవస్థానం కమిటీ చైర్మన్ గుమ్మ గంగరాజు యాదవ్, ఆలయ కమిటీ ముఖ్య నాయకులు మెట్ల చెంచయ్య యాదవ్, ఆర్టీసీ యాదవ సంఘం నాయకులు చేతుల శ్రీనివాస్ యాదవ్, మార్కాపురం డివిజన్ యువజన నాయకులు నాగం రామకృష్ణ యాదవ్, పిన్నిక చక్రపాణి యాదవ్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్ తదితర నాయకులు వెంకట్రావు ను కలిసి అభినందనలు తెలియజేశారు.

# బాలుర ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్న ఎల్ హెచ్ ఆర్ ప్రభుత్వ కాలేజ్ జట్టు

● బాలికల ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ విజేత కైకలూరు వైవిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు









మైలవరం,అక్టోబరు 8 (వార్తాప్రభ) : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న కృష్ణ యూనివర్సిటీ మెన్ అండ్ ఉమెన్ ఫెన్సింగ్ పోటీలు బుధవారం ముగిశా యి.బాలుర ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ ట్రోఫీని మైలవరం లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు కైవసం చేసుకోగా,బాలికల ఫెన్సింగ్ ఛాంపియన్షిప్ విజేతగా కైకలూరు వైవిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు నిలిచింది. నాలుగు గోల్డ్,మూడు సిల్వర్,మూడు బ్రాంజ్ మెడల్స్ ను సాధించి కృష్ణ యూనివర్సిటీ ఓవరాల్ ఛాంపియన్షిప్ ను రెండు జట్లు కైవసం చేసుకోవడం జరిగిందని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మేజర్ మన్నే స్వామి తెలియజేశారు.ఈ పోటీలో అత్యంత ప్రతిభ చూపిన క్రీడాకారులను కృష్ణా యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేయడం జరిగిందని వెల్లడించారు.ఈ కృష్ణ యూనివర్సిటీ జట్టు పంజాబ్ లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీ నందు అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్.నవీన లావణ్యలతా తెలియజేశారు.కళాశాలలో విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో కూడా మంచి ప్రాధాన్యం ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇల్లా రవి కొనియాడారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన కల్పించాలి -బృందా జి కృష్ణన్ పీహెచ్డీ స్కాలర్

**-జి.కొండూరు,మైలవరం,తిరువూరు మండలాల్లో పర్యటించిన బృందా కృష్ణన్**





మైలవరం/జి.కొండూరు,అక్టోబరు 8 (వార్తాప్రభ) : ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన కల్పించడంతో పాటు ఇంకా అమల్లోకి తీసుకు రావాలని ఢిల్లీ నుంచి వచ్చిన బృందా జి కృష్ణన్ పీహెచ్డీ స్కాలర్ ప్రకృతి వ్యవసాయ (APCNF) సిబ్బంది కి సూచించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పరిశీలన కార్యక్రమం లో భాగంగా ఢిల్లీ నుంచి వచ్చిన బృందా జి కృష్ణన్ పీహెచ్డీ స్కాలర్ ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వై.శంకర్ నాయక్ తో కలిసి ఎన్టీఆర్ జిల్లాలోని జి.కొండూరు, మైలవరం, తిరువూరు మండలాల్లో 8 అక్టోబర్ 2025 బుధవారం పర్యటించారు.రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయం అమలవుతున్నతీరు,పురోగతి గురించి వై.శంకర్ నాయక్ బృందా కృష్ణన్ కు వివరించారు.కాటన్ ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్స్ ,PADDY లైన్స్ SOWING, Paddy రైజ్డ్ బెడ్స్ ఎక్స్పరిమెంట్, బయో ఇన్పుట్ ల తయారీ ఘన ద్రవ జీవామృతం మరియు ద్రవ జీవామృతం పొలంలో పారించి చూపించడం జరిగింది.అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు వాటి ఉపయోగాలు గురించి వివరించారు. తిరువూరు మండలం రామన్నపాలెం గ్రామంలో బృందా జి కృష్ణన్ పీహెచ్డీ స్కాలర్ రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ప్రకృతి వ్యవసాయంపై వారి అనుభవాలను తెలుసుకున్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వల్ల తమ ఖర్చులు తగ్గి దిగుబడులు పెరిగినట్లు వివరించారు.అనంతరం బృందా జి కృష్ణన్ రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను, దాని ప్రయోజనాలను రైతులకు వివరించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రకృతి వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించా రు.ఈ కార్యక్రమంలో సౌమ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# త్వరలో మేమొస్తాం....క్లస్టర్ కు భూములు కేటాయిస్తాం

## -తెగేసి చెప్పిన టీడీపీ నాయకులు



పెడన,అక్టోబరు 8 (వార్తాప్రభ) : త్వరలోనే పురపాలక సంఘంలో తాము అధికారం లోకి వస్తామని అప్పుడు కలంకారీ క్లస్టర్ కు భూములు కేటాయించుకుంటామని టిడిపి నాయకులు చెప్పారు. వైసిపి కౌన్సిలర్ల ఆరోపణలకు సమాధానంగా బుధవారం నాడు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. మున్సిపల్ మాజీ ఇంచార్జ్ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం( హన్ను ) పట్టణ టిడిపి అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య మాజీ కౌన్సిలర్ యర్రా రాజా తదితరులు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. కలంకారీ వ్యాపారం మీద జీవనం సాగిస్తూ క్లస్టర్ కు వ్యతిరేకంగా పనిచేయడం సరయిన చర్య కాదని కటకం ప్రసాద్ ను హన్ను తప్పు పట్టారు. తాము అధికారం లోకి రాగానే భూములు కేటాయించుకుంటామని అన్నారు. నిన్నుగాక మొన్న కళ్ళు తెరిచిన వైస్ చైర్మన్ కాజా కూడా రాష్ట్రస్థాయి నాయకుడైన వేణుగోపాలరావు ను విమర్శిస్తున్నాడని ఎద్దేవా చేసారు. జిల్లా పరిషత్తు హైస్కూల్లో నాడు నేడు నిధులు తో చేపట్టిన పనుల్లో అవకతవకలు జరగలేదా అని ప్రశ్నించారు. శ్యామలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడవనున్న క్లస్టర్ విషయంలో కలెక్టర్ ఆదేశాలను కూడా వైసిపి కౌన్సిలర్లు తిరస్కరించటం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధికి చిరునామా వేణుగోపాలరావు అని ప్రశంసించారు. రానున్న ఎన్నికల్లో ఎవరి సత్తా ఏంటో తేల్చు కుందామని సవాల్ విసిరారు. రాజా మాట్లాడుతూ మొన్న జరిగిన కార్మికుల సభ విషయం వంతం కావడంతో వైసిపి నాయకులకు అక్కసు ఎక్కువైందని అన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం వెనుక వేణు శేషం ల పాత్ర ఉందని గుర్తు చేశారు. రహదారి విస్తరణ పనులను ఎవరు ఆపారో అందరికీ తెలుసు అని చెప్పారు. ఇక ఈ సమావేశంలో చందన నారాయణరావు పరసా జితేంద్ర కమ్మగంటి వెంకటేశ్వరరావు బొడ్డు తాతయ్య వెనిగట్ల ప్రసాద్ తమ్మా భీమయ్య సేనాపతి అజయ్ ఖలీల్ భాషా యక్కల బసవ తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ వ్యవస్థ సరి చేయండి బాబోయ్



హనుమాన్ జంక్షన్,అక్టోబరు 8 (వార్తాప్రభ) : బాపులపాడు మండలం బండారు గూడెం గ్రామంలో ఈరోజు సాయంత్రం కురిసిన భారీ వర్షం వలన గ్రామంలోని రోడ్లపై మురుగునీరు నిలిచిపోయాయి.గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వలన ఈ పరిస్థితి ఏర్పడింది. గ్రామస్థులు మరియు సిపిఎం పార్టీ నాయకుడు బర్రె లెనిన్ ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ, ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య చాలా కాలంగా ఉంది. ప్రతిసారి వర్షం కురిసినప్పుడు ఇదే పరిస్థితి రోడ్లపై నిలిచిన మురుగునీరు ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటపడడం కష్టమవుతోంది. మేము ఎన్నిసార్లు మనవి చేసుకున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు అని లెనిన్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి వలన గ్రామస్థుల యొక్క రోజువారీ జీవన విధానం పై ప్రభావం చూపుతోందని, త్వరితగతిన అధికారులు చర్యలు చేపట్టవలసినదిగా డిమాండ్ చేశారు.

# జీజీహెచ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో బాణా సంచా ప్రమాద బాధితులకు చికిత్స

కాకినాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) : డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలో జరిగిన బాణా సంచా పేలుడు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 30 ఏళ్ల మహిళ (అనపర్తి), 45 ఏళ్ల మహిళ (సోమేశ్వరం),21 ఏళ్ల యువకుడు (పెదపూడి మండలం) ను కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తరలించారు.జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్య కుమారి పర్యవేక్షణలో సర్జరీ, అనస్థీషియా,ప్లాస్టిక్ సర్జరీ, క్యాజువాల్టీ, మెడికల్ ఆఫీసర్,నర్సింగ్ సిబ్బంది, ఇతర విభాగాల సిబ్బంది సమన్వయంతో గాయపడిన వారికి తక్షణ వైద్యం అందించారు. డిప్యూటీ కలెక్టర్ ,అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీనివాసన్ ,సీఎస్ఆర్ఎవో డా.మెహర్ కుమార్ కూడా సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు చికిత్స పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.ముగ్గురి పరిస్థితి ప్రస్తుతం అత్యంత విషమంగా ఉండడంతో వారిని సర్జికల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్) లో ఉంచి నిరంతర వైద్య పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి సిబ్బంది గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తున్నారు.

# వన్య ప్రాణి వారోత్సవాలలో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ



కాకినాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) : ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు కాకినాడ అటవీ శాఖ వారు నిర్వహించిన చిత్రలేఖనం,వ్యాసరచన పోటీలలో బహుమతులు సాధించినట్లు ఆదిత్య డిగ్రీ, పీ.జి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు తెలియజేశారు. ప్రపంచ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా కాకినాడ అటవీ శాఖ వారు వ్యాసరచన,చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వ్యాస రచన పోటీలలో ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన వివి వర్షిత్, కె.దేవి ప్రియ, కే.రేఖ భవాని , చిత్రలేఖనం పోటీలలో ఏ. సాయి పవన్,ఎ.బుజ్జమ్మ, వై. శైలజ ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు సాధించారు.విజేతలకు కోరంగి అభయారణ్యంలో జరిగిన వేడుకలలో డీఎఫ్ఓ ఎన్ రామచంద్రరావు, రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ ప్రశంసా పత్రాలను జ్ఞాపికలను అందించారు. విజేతలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి. తేజేశ్వరరావు,డి.అశ్విని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇసుక ఉన్నట్టా లేనట్టా 50- 50 ఛాన్స్





విస్సన్నపేట,అక్టోబరు 8 (వార్తాప్రభ) : స్థానిక మండల ప్రజా పరిషత్తు కార్యాలయ భవన నిర్మాణం సున్నం రాయి కట్టుడితో 1939 వ సంవత్సరంలో నిర్మాణమైనట్లుగా పలువురు అనుకుంటున్నారు. భవనాన్ని తొలగించేందుకు అతి త్వరలో టెండర్లు పిలవనున్న సమయంలో కొందరు ఆశావాహులు ఆనాడు భవనపు పునాదుల ఖాళీలలో ఇసుక నింపి ఉండే అవకాశం ఉంటుందని 10 అడుగుల లోతు పునాదులు ఉండే పరిస్థితి ఉన్నదని టన్నులకొద్దీ ఇసుక లభ్యమయ్య పరిస్థితి ఉంటుందని అంచనాలు వేస్తున్నట్లు తెలుస్తోంది. అదే నిజమైతే ఓపెన్ ఆక్షన్ భారీ స్థాయిలో ఉంటుందని సర్వత్రా వినిపిస్తుంది.

# లయ నిజం అంటే సేవ - జిల్లా గవర్నర్ వి.వి.పి.ఎస్.ఆంజనేయులు



మైలవరం,అక్టోబరు 8 (వార్తాప్రభ) : లయ నిజం అంటే సేవ అని, ప్రపంచవ్యాప్తంగా లయ నిజం ఉందని లయన్ జిల్లా గవర్నర్ వి.వి.పి.ఎస్. ఆంజనేయులు అన్నారు.సేవా యజ్ఞం కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో బుధవారం పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటటం, అన్నదాన కార్యక్రమం, ఐస్క్రీనింగ్ క్యాంపు, నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆంజనేయులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జయంతి నుంచి మెల్విన్ జోన్స్ జన్మదినోత్సవం వరకు సేవా యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు.అనంతరం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్మినెంట్ ప్రాజెక్టులు ఉచితకుట్టు మిషన్ కేంద్రం, హిందూ స్మశాన వాటిక, ఎల్వి ప్రసాద్ ఉచిత కంటి శిబిరాన్ని సందర్శించారు. ఫాస్ట్ జిల్లా గవర్నర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి విద్యార్థు లకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించారు. నూతనంగా ఇద్దరు లైన్స్ సభ్యత్వం తీసుకున్నారు.చైల్డ్ ఐ కేర్ క్యాంపు జిల్లా కోఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు ఉచితంగా 250 మంది విద్యార్థులకు కళ్ళజోళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫస్ట్ వైస్ గవర్నర్ ఎన్. వి. ఎస్ ఎస్ ప్రసాద్, సెకండ్ వైస్ గవర్నర్ చెన్నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జీఎస్టీ కోఆర్డినేటర్ కంచర్ల ముత్య ప్రసాద్, జెడ్ సి తిరుమల శెట్టి శ్రీధర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జాస్తి వెంకటేశ్వరరావు, గ్యాట్ వైస్ చైర్ పర్సన్ వై గాంధీ, జిఎంటి కోఆర్డినేటర్ ఎస్సీ శ్రీనివాసరావు, మార్కెటింగ్ చైర్ పర్సన్ కే ఎన్ ఆర్ కే ప్రసాద్, ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ సుదీర్ పాల్ రెడ్డి, క్యాబినెట్ మెంబర్ సిహెచ్ బాలగోపాల్ రెడ్డి, లైన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం పిఎస్టీలు చనుమోలు నాగభూషణం, శీలం రామిరెడ్డి, చలువాది హరీష్ కుమార్ గుప్తా, లైన్ మెంబర్లు లేళ్లఏడుకొండలు, పులిపాటి శ్రీనివాసరావు, మద్దినేని శ్రీనివాసరావు, సంగు రాంప్రసాద్, ఆలమూరు చంద్రం, బాలాజీ, ప్రసాద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కుక్క కాటు బాధితురాలని పరామర్శించిన ఆర్.కె.



గుడివాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) : గుడివాడ రూరల్ మం॥ రామనపూడి గ్రామానికి చెందిన మోక్ష అనే బాలిక కుక్క కాటుకు గురై ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది.. ఈ క్రమంలో గుడివాడ భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ మాచర్ల రామకృష్ణ (ఆర్.కె.) బుధవారం ఉదయం పరామర్శించారు. బాలిక తల్లిదండ్రులకు ధైర్యం తెలియజేసి, ప్రభుత్వ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందచేయాలని కోరారు. దీని మీద తక్షణమే ప్రభుత్వ అధికారులు దృష్టి పెట్టాలనీ కోరుతూ ఆర్డీఓ ఆఫీసులో వినతిపత్రం అందజేసారు.

# జగన్ ఇంటికి డీఎస్సీ అభ్యర్థులు..! ప్లకార్డులతో నిరసనలు..!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న జగన్ కు సమాచారం ఇచ్చారు. దీంతో జగన్ బయటికి వచ్చారు. డీఎస్సీ అభ్యర్థులను కలిశారు. పరీక్షల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని డీఎస్సీ అభ్యర్థులు చేసిన ఆరోపణలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా జగన్ ను తమకు న్యాయం జరిగేలా చూడాలని అభ్యర్థులు ఆయన ను కోరారు. మెగా డీఎస్సీ పేరుతో తమను కూటమి ప్రభుత్వం దగా చేసిందని వారు వాపోయారు. మెరిట్‌ను విస్మరించి రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరించిందని, తమకు న్యాయం చేయాలని వారంతా వైయస్ జగన్‌ను కోరారు. దీంతో సానుకూలంగా స్పందించి జగన్.. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చి పంపారు. ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీ పరీక్షల ఫలితాలు వచ్చి ఎంపికైన వారంతా ఉద్యోగాల్లో కూడా చేరిపోయారు. ప్రభుత్వం డీఎస్సీని విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పుకుంది. ఇలాంటి సమయంలో డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ ఎంపిక కాని అభ్యర్థులు ఇలా జగన్ ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి స్పందనా రాలేదు.

# కాలనీలో పలు సమస్యలపై కార్పొరేటర్ కి వినతి పత్రం అందజేసిన కాలనీ అధ్యక్షులు "భేరి"



హైదరాబాద్,అక్టోబరు 8 (వార్తాప్రభ) : గచ్చిబౌలి డివిజన్, నేతాజీ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిసి రోడ్లు శానిటేషన్ సిబ్బంది కొరత వల్ల కాలనీలో పలు ప్రదేశాల్లో చెత్త చెదారం పేర్కొంది. వీధిలైట్లు డ్రైనేజీ ఔట్లెట్ లేక మురుగునీరు కాలనీలో నిలబడి దుర్వాసన వస్తుంది. దీని వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలోని సమస్యలపై గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమం లో సాయిబాబా ఆలయ ప్రధాన అర్చకులు, జోషి రాఘవేంద్ర శర్మ, చిట్టెమ్మలాల్ రెడ్డి, జయ రెడ్డి, రాధా రాణి రెడ్డి, అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందించారు. కాలనీలో ఉన్న సమస్యలు త్వరగా పరిష్కరణ పరిష్కరించాలని విన్నవించుకున్నారు. కాలనీలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కి కాలనీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ మరియు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# 10న శ్రీ లక్ష్మీ గణపతి హెూమం



గుడివాడ,అక్టోబరు 8 (వార్తాప్రభ) : కృష్ణా జిల్లా, గుడివాడ పట్టణం, మెయిన్ రోడ్ లో వెంచేసియున్న శ్రీ విగ్నేశ్వర స్వామి వారి దేవస్థానం లో అశ్వియుజ మాసం బహుళ చవితి ది 10-10-2925 శుక్రవారం సంకష్ట హర చతుర్థి పర్వదినం సందర్భముగా శ్రీ స్వామివారి ఆలయ ఆవరణలో వేదపండితులచే ఉదయం 10-00లకు లక్ష్మీ గణపతి హెూమం పూజా కార్యక్రమం కలదని ఈ.ఓ. యార్లగడ్డ వాసు చైర్మన్ సాయన రాజేష్ లు తెలిపారు. ఈ హెూమం పూజ చేయించుకును భక్తులు రు॥ 516/-లు దేవస్థానం కార్యాలయం నందు చెల్లించి తమ యొక్క గోత్ర నామములు నమోదు చేయించుకొని తగు రసీదు పొందాలనీ పేర్కొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188